ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -326 పేజీలు - 8 వెల - 03/- శుక్రవారం 13 మార్చి 2026




# పెట్టుబడులను ఆకర్షించండి

## రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

- నీటి వినియోగంలో జాగ్రతత్తుల ముఖ్యం
- భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి
- రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చే యత్నం
- జగన్ హయాంలో పెట్టుబడిదారుల పరార్
- జిల్లాల వారీగా పెట్టుబడులు,
- ఉద్యోగ అవకాశాలు
- సంపద సృష్టిస్తేనే మెరుగైన సమాజం సాధ్యం

**అమరావతి,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
నీటిని సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రయోజనం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. పెట్టుబడులు, వైద్యం, సూపర్ సిక్స్- సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య-నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తున్నారు. జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను సీఎం అధికారులకు వివరించారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. సంపద సృష్టించేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎలా ఉన్నామో జిల్లాల వారీగా వివరాలు ఉండాలి. **మిగతా 2లో...**





# యుద్ధం ఆగాలంటే.. ఇరాన్ మూడు షరతులు!


- అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం ముగింపునకు మూడు షరతులు పెట్టిన ఇరాన్
- తమ హక్కులను గుర్తించి, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్
- భవిష్యత్తులో దాడులు జరగవని హామీ ఇవ్వాలని స్పష్టం చేసిన అధ్యక్షుడు
- తమ పోర్టులపై దాడి చేస్తే రీజియన్‌లోని అన్ని పోర్టులే లక్ష్యమని మిలిటరీ హెచ్చరిక

**న్యూఢిల్లీ,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న ఘర్షణకు ముగింపు పలకడానికి ఇరాన్ మూడు కీలక షరతులను ముందుకు తెచ్చింది. ఒకవైపు శాంతి కోసం ప్రతిపాదనలు చేస్తూనే, మరోవైపు తమపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని ఆ దేశ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది.ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఈ షరతులను ప్రకటించారు. రష్యా, పాకిస్థాన్ దేశాధినేతలతో మాట్లాడిన తర్వాత ఆయన ఈ పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్, అమెరికా ప్రారంభించిన ఈ యుద్ధాన్ని ముగించాలంటే ఇరాన్ చట్టబద్ధమైన హక్కులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. **మిగతా 2లో...**

# ఏపీ రైతులకు ఉగాది కానుక...

## నేడు అన్నదాత సుఖీభవ 3.0 సాయం

- 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,000 చొప్పున జమ
- కృష్ణా జిల్లా సూరంపల్లిలో నిధులు విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు
- ఏడాదికి రూ.20 వేల హామీ పూర్తి చేసిన కూటమి ప్రభుత్వం



**అమరావతి,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
ఉగాది కానుకగా కూటమి ప్రభుత్వం రైతన్నలకు 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ చేయనుంది. 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 3.0'లో భాగంగా రైతులకు నేడు(మార్చి 13) ఆర్థిక సాయాన్ని విడుదల చేయనుంది. **మిగతా 2లో...**

# భారత నౌకలు వెళ్లొచ్చు

- 'హర్మ్యూజ్'ను సురక్షితంగా దాటిన రెండు భారత నౌకలు!
- ఇరాన్ విదేశాంగ మంత్రితో జైశంకర్ చర్చలతో సానుకూల పరిణామం
- యుద్ధం మొదలైన తర్వాత హర్మ్యూజ్ దాటిన తొలి భారత నౌక
- సౌదీ నుంచి ముంబై చేరిన ఆయిల్ ట్యాంకర్ షిప్



# మత్స్యకారులకు అండ

- మారిటైమ్ గ్లోబల్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతామన్న మంత్రి లోకేశ్
- నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో అటానమస్ షిప్ యార్డ్‌కు శంకుస్థాపన
- దేశంలోనే ఇది తొలి అటానమస్ మారిటైమ్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్

**అమరావతి,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్‌ను మారిటైమ్ ఇన్నోవేషన్, అటానమస్ సిస్టమ్స్ రంగంలో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, రాష్ట్రంలో దేశ సముద్ర సాంకేతికత, తీర భద్రత, బ్లూ ఎకానమీలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. **మిగతా 2లో...**



# ఇఫ్తార్ విందులు సరే... రంజాన్ తోఫా ఏది?: షర్మిల

- చంద్రబాబు మోదీకి, బీజేపీకి భయపడుతున్నారని ఆరోపణ
- మైనారిటీ సంక్షేమంపై కూటమి ప్రభుత్వానిది బూటకమని విమర్శ
- వెంటనే పేద ముస్లింలకు తోఫా పంపిణీ చేయాలని డిమాండ్

**అమరావతి,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందులు బాగానే ఉన్నాయని, కానీ పేద ముస్లింలకు ఇస్తానన్న 'రంజాన్ తోఫా' సంగతేంటని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబును **మిగతా 2లో...**



# పార్టీ ఫిరాయింపు కేసును ముగించిన సుప్రీంకోర్టు

## 10 మంది ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్..

- తెలంగాణలో ఉత్కంఠ రేపిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారం
- అన్ని పిటిషన్లను స్పీకర్ పరిష్కరించారన్న న్యాయవాది అభిషేక్ సింఘ్వీ
- స్పీకర్ నిర్ణయం నేపథ్యంలో విచారణ ముగిసిందని ప్రకటించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇప్పటికే ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తరపు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. **మిగతా 2లో...**

# వైసీపీ కోట్లాది ప్రజలు సొత్తు

- ఆనాడు ఒక్కడినే..ఈనాడు కోట్లాదమందికి అండ
- నల్లకాలువ సాక్షిగా ఇచ్చిన హామీ మేరకు పార్టీ స్థాపన
- కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిండుగా ఉంది
- పార్టీ ఆవిర్భావ వేడుకల్లో వైఎస్ జగన్

**అమరావతి,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
పార్టీ స్థాపన సమయంలో తాను ఒక్కడినే ఉన్నానని, కానీ ఇప్పుడు కోట్లాది మంది ప్రజల ఆశీర్వాదంతో వైసీపీ ఒక పెద్ద శక్తిగా ఎదిగిందని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ చెప్పారు. నల్లకాల్వలో ఇచ్చిన మాటే పార్టీ ఆవిర్భావానికి ప్రధాన కారణమైంది. ఆ ఒక్క మాట రాష్ట్ర రాజకీయాల దశ, దిశను మార్చిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. 2011 మార్చి 12న స్థాపించబడిన వైసీపీ..**మిగతా 2లో...**



# మంత్రులకు రేటింగ్స్

- హోం మంత్రి అనిత లాస్ట్!
- తొలి స్థానంలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు
- నాలుగో స్థానంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**అమరావతి,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సు వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రుల పనితీరుపై నిర్వహించిన సమీక్ష రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం మాటలతో కాకుండా, ఏ మంత్రి వద్ద ఫైళ్లు ఎంత వేగంగా క్లియర్ అవుతున్నాయనే అంశంపై సీఎం స్వయంగా 'గణాంకాలతో కూడిన రేటింగ్స్' ప్రకటించడం విశేషం. **మిగతా 2లో...**

# మంత్రులకు రేటింగ్స్

**మొదటిపేజీ తరువాయి**

పాలనలో పారదర్శకత, వేగం పెంచడమే లక్ష్యంగా ఈ విశ్లేషణ సాగింది.

ముఖ్యమంత్రి వెల్లడించిన నివేదిక ప్రకారం, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అందరికంటే వేగంగా ఫైళ్లను పరిష్కరిస్తూ మొదటి స్థానంలో నిలిచారు. ఆయన పనితీరుపై సీఎం ప్రశంసలు కురిపించారు. అచ్చెన్నాయుడు తర్వాత వరుసగా మంత్రులు నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ఉత్తమ రేటింగ్స్‌తో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఇక ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ జాబితాలో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు.

అయితే, కీలకమైన హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న వంగలపూడి అనిత ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో అందరికంటే చివరి స్థానంలో నిలవడం గమనార్హం. ఫైళ్లను పెండింగ్‌లో ఉంచడం వల్ల పరిపాలన కుంటుపడుతుందని, నిర్ణీత సమయంలోగా నిర్ణయాలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. మంత్రులందరూ తమ శాఖల్లో ఫైళ్ల కదలికపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు సేవలు అందించడంలో జాప్యం సహించబోమని ఆయన సుతిమెత్తగా హెచ్చరించారు.

## యుద్ధం ఆగాలంటే.. ఇరాన్ మూడు షరతులు!

**మొదటిపేజీ తరువాయి**

అంతేకాకుండా యుద్ధం వల్ల జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో తమ దేశంపై మళ్లీ దాడులు జరగకుండా కఠినమైన అంతర్జాతీయ హామీలు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు షరతులకు అంగీకరిస్తేనే శాంతి సాధ్యమని ఆయన తేల్చిచెప్పారు.

ఇరాన్ అధ్యక్షుడు శాంతి కోసం షరతులు విధిస్తున్న తరుణంలోనే ఆ దేశ సైన్యం నుంచి తీవ్ర హెచ్చరికలు వెలువడ్డాయి. ఇరాన్ సాయుధ దళాల ప్రతినిధి అబోల్ఫజల్ షెకార్చి ప్రభుత్వ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ అమెరికాకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ అమెరికా తమ దేశంలోని పోర్టులపై దాడి చేస్తే, పర్షియన్ గల్ఫ్‌లోని ఏ ఒక్క పోర్టు, ఆర్థిక కేంద్రం, లేదా ఇతర ప్రాంతం సురక్షితంగా ఉండదని హెచ్చరించారు. "మా ఓడరేవులపై దాడులు జరిగితే, ఈ రీజియన్‌లోని అన్ని పోర్టులు, రేవులు మా చట్టబద్ధమైన లక్ష్యాలుగా మారతాయి" అని ఆయన పేర్కొన్నారు.

అంతేగాక తమ పోర్టులపై దాడి జరిగితే ఇప్పటివరకు చేసిన దానికంటే చాలా భారీ స్థాయిలో సైనిక చర్య చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రాంతంలోని దేశాలు తమ భూభాగాల నుంచి అమెరికన్లను తరిమికొట్టాలని కూడా షెకార్చి పిలుపునిచ్చారు. ఒకవైపు ఇరాన్ రాజకీయ నాయకత్వం శాంతి కోసం షరతులు పెడుతూనే, మరోవైపు సైనిక నాయకత్వం తీవ్రమైన పరిణామాల గురించి హెచ్చరించడం పశ్చిమాసియాలో నెలకొన్న సంక్లిష్ట, ఉద్రిక్త పరిస్థితికి అద్దం పడుతోంది.

## భారత నౌకలు వెళ్లొచ్చు

**న్యూఢిల్లీ,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**

పశ్చిమాసియా యుద్ధ మేఘాల మధ్య అత్యంత ఉత్కంఠ నెలకొన్న హర్మూజ్ జలసంధిని రెండు భారత వాణిజ్య నౌకలు సురక్షితంగా దాటాయని సమాచారం. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ మధ్య జరిగిన కీలక చర్చల అనంతరం ఈ సానుకూల పరిణామం చోటుచేసుకుందని తెలుస్తోంది. యుద్ధ ఉద్రిక్తతల వల్ల ఈ జలసంధి గుండా ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారిన తరుణంలో భారత జెండా ఉన్న నౌకలకు ఇరాన్ ప్రభుత్వం ప్రత్యేక భద్రతా భరోసా కల్పించింది.ఈ దౌత్యపరమైన ముందడుగుతో భారత్‌కు అందే ముడి చమురు, ఎరువుల సరఫరాకు ఎదురైన అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది. జైశంకర్ తన ఇరాన్ సహచరుడితో జరిపిన సంప్రదింపుల్లో భారత ఆర్థిక ప్రయోజనాలను, నౌకల భద్రతను ప్రధానంగా ప్రస్తావించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఇరాన్, భారత నౌకలను తమ ఐఆర్‌జీసీ దళాలు లక్ష్యంగా చేసుకోబోవని, అవి జలసంధిని దాటేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది.

**యుద్ధం మొదలైన తర్వాత హర్మూజ్ దాటిన తొలి నౌక..**

ఇరాన్, అమెరికా మరియు ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం మొదలైన తర్వాత హర్మూజ్ జలసంధి దాటి తొలి ముడి చమురు నౌక భారత్‌కు చేరుకుంది. 'హిందుస్థాన్ టైమ్స్' నివేదిక ప్రకారం.. సౌదీ అరేబియా నుంచి ముడి చమురును తీసుకువస్తున్న 'షెన్‌లాంగ్ సూయజ్‌మాక్స్' చమురు ట్యాంకర్ ముంబై పోర్టుకు చేరుకుంది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఈ వ్యూహాత్మక జలమార్గం గుండా సురక్షితంగా ప్రయాణించిన మొదటి భారతీయ నౌక ఇదే.

లైబీరియాలో రిజిస్టరైన ఈ ట్యాంకర్ కు ఒక భారతీయుడు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది మార్చి 1న రాస్ తనూరా చమురు టెర్మినల్‌లో ముడి చమురును లోడ్ చేసుకుని, రెండు రోజుల తర్వాత తన ప్రయాణాన్ని ప్రారంభించింది. మారిటైమ్ ట్రాకింగ్ సంస్థలు 'లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్', 'ట్యాంకర్ ట్రాకర్స్' నివేదికల ప్రకారం.. ఈ నౌక మార్చి 8న హర్మూజ్ జలసంధి లోపల ఉన్నప్పుడు చివరిసారిగా దీని సిగ్నల్ నమోదైంది.

## పార్టీ ఫిరాయింపు కేసును ముగించిన సుప్రీంకోర్టు

**మొదటిపేజీ తరువాయి**

ఫిరాయింపులపై దాఖలైన మొత్తం 10 పిటిషన్లను స్పీకర్ ఇప్పటికే పరిష్కరించారని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనానికి వివరించారు. సదరు 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ తేల్చిచెప్పినట్లు ఆయన తెలిపారు. సింఘ్వీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను రెండు రోజుల్లోగా ఫిర్యాదుదారులకు అందజేయాలని ఆదేశించింది. స్పీకర్ తన నిర్ణయాన్ని వెలువరించిన నేపథ్యంలో, ఈ పిటిషన్లపై విచారణ ముగిసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది.

## రంజాన్ తోఫా ఏది?: షర్మిల

**మొదటిపేజీ తరువాయి**

సూటిగా ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'చంద్రన్న తోఫా' ఇస్తామని చెప్పి, రెండేళ్లుగా ఎందుకు అమలు చేయడం లేదని ఆమె నిలదీశారు.

ఈ సందర్భంగా షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ... "రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న ప్రభుత్వానికి, 12 లక్షల పేద ముస్లిం కుటుంబాలకు తోఫా ఇవ్వడానికి అవసరమైన రూ.65 కోట్లు బరువయ్యాయా?" అని విమర్శించారు. గతంలో తోఫా ఇవ్వనందుకు జగన్‌కు ముస్లింలు బుద్ధి చెప్పారని, ఇప్పుడు మీకు ఎలా చెప్పాలో ఆలోచించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.

కూటమి ప్రభుత్వం చెబుతున్న మైనారిటీ సంక్షేమం అంతా బూటకమని షర్మిల ఆరోపించారు. "చంద్రబాబు ప్రధాని మోదీకి వణుకుతున్నారు. బీజేపీకి, ఆర్ఎస్ఎస్ భావజాలానికి ముఖ్యమంత్రి గులాంగిరీ చేస్తున్నారు. మైనారిటీలకు నిధులిస్తే తమ సంక్షేమం ఎక్కడ ఆగిపోతుందోనని భయపడుతున్నారు" అని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు మైనారిటీల అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తక్షణమే పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఏపీ రైతులకు ఉగాది కానుక...

**మొదటిపేజీ తరువాయి**

మూడవ విడతగా 46.85 లక్షల మందికి కేంద్ర, రాష్ట్ర వాటా కలిపి ఒక్కో రైతు అకౌంట్‌లో రూ.6,000 జమ చేయనుంది. మూడో విడతగా రూ.2,676 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. ఇందులో రాష్ట్ర వాటా రూ.1,874 కోట్లు. ఇప్పటికే రెండు విడతల కలిపి రూ.14 వేలను ప్రభుత్వం అందించింది. శుక్రవారం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రైతులకు ఇచ్చిన హామీ ఏడాదికి రూ.20 వేల సాయం పూర్తవుతుంది.

**ఏడాదిలో రూ.8,985 కోట్ల సాయం**

ఒక్కో రైతు కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని కూటమి ఎన్నికల వేళ సూపర్ -6 హామీల్లో పేర్కొంది. కేంద్రం పీఎం కిసాన్ కింద రూ.6,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000 కలిపి మూడు విడతల్లో ప్రతీ రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు 2025 ఆగస్ట్ 2న మొదటి విడతగా రూ.7 వేల చొప్పున రూ.3,174 కోట్లు, నవంబర్ 19న రెండవ విడతగా రూ.7 వేల చొప్పున రూ.3,135 కోట్లు కలిపి రూ.6,309 కోట్లు రైతులకు అందించింది. రేపు మూడో విడతలో రూ.6 వేల చొప్పున 46.85 లక్షల మందికి రూ.2,676 కోట్లు ఇవ్వనుంది. ఒక్క ఏడాదిలోనే రైతు సోదరులకు కూటమి ప్రభుత్వం రూ.8,985 కోట్లు అందించినట్లు అవుతుంది. ఇందులో రాష్ట్ర వాటా రూ.6,560 కోట్లు కాగా, కేంద్రం వాటా రూ.2,425 కోట్లు.

**సూరంపల్లి నుంచి నిధులు విడుదల చేయనున్న సీఎం**

అన్నదాత సుఖీభవ 3.0 నిధులు విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. కృష్ణాజిల్లా, గన్నవరం నియోజకవర్గం, సూరంపల్లిలో శుక్రవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.20 గంటలకు సీఎం సూరంపల్లికి చేరుకుంటారు. 4.25 గంటల నుంచి 4.55 గంటల వరకు రైతు సోదరులతో ముఖాముఖి అవుతారు. 5.00 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తారు.

# పెట్టుబడులను ఆకర్షించండి

**మొదటిపేజీ తరువాయి**

గత వైకాపా హయాంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రాలేదు. ఉన్న కంపెనీలు కూడా పారిపోయిన పరిస్థితి అందరం చూశాం. వనరులు ఉన్నా సరైన రీతిలో ఉపయోగించుకోవాలి. లేదంటే వ్యర్థమేనని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. సంపద సృష్టితో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. కుటుంబ సాధికారిత సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ పథకాల లబ్దిదారులకు ప్రజా ప్రతినిధుల ద్వారా సంక్షేమ లేఖలు అందివ్వాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ పథకాల పారదర్శకతతో అమలుకు, ఓనర్‌షిప్ తీసుకునేందుకు సంక్షేమ లేఖలు ఇవ్వాలని నిర్ణయించారు. పెట్టుబడుల గురించి ఆలోచించినట్లే... పేదల గురించి ఆలోచించాలని సూచించారు. త్వరలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ఓ లేఖను లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. లబ్దిదారులకు ప్రతీ నెలా ఏం లబ్ది కలిగిందో తెలియజేయాలని సూచించారు. ఏ కుటుంబానికి ఏం లబ్ది కలిగిందో తెలిస్తే అంతా పారదర్శకంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం అందించే పెన్షన్, ఉచిత సిలిండర్, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటివి లబ్దిదారులకు తెలియాలని సూచించారు. దీపం 2.0 పథకానికి డిజిటల్ ఓచర్ జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. డీబీటీ పథకాల్లో ప్రోగ్రామబుల్ వోచర్లను లబ్దిదారులకు ఇస్తే వారు వినియోగించుకుంటారన్నారు. మార్చి 9వ తేదీ నాటికి ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా 50.45 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారని.. రూ.1775 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి రీయంబర్స్ చేసిందని వివరించారు. డ్వాక్రా, మెప్మా సంఘాల సేవలను వినియోగించుకుని పీ4తో సహా జీరో పావర్టీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.అన్నదాత సుఖీభవ ద్వారా రేపు మూడో విడత నిధులు విడుదల చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అన్నాక్యాంటీన్ల ద్వారా 7.5 కోట్ల భోజనాలు ఇప్పటి వరకూ పేదలకు అందించగలిగామని చెప్పుకొచ్చారు. అంగన్‌వాడీ, ఆశాలకు గ్రాట్యూటీ అమలు చేస్తున్నామని అన్నారు. రూ. వెయ్యి కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టామని తెలిపారు. పల్లె పండుగ కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని అన్నారు. సంక్షేమ పథకాలు పేదలందరికీ అందించడమే లక్ష్యంగా కలెక్టర్లు పనిచేయాలని మార్గనిర్దేశర చేశారు. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. ప్రతీ ఒక్కరికీ ఇంటిస్థలం లేదా ఇంటిని మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉగాదికి 2.50 లక్షల మందికి సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ ఇంటికీ జేజేఎం కింద తాగునీటి కుళాయి ఇస్తామని... ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సాలిడ్, లిక్విడ్ మేనేజ్‌మెంట్ ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. నెట్ జీరో కాన్సెప్టుగా ఘన వ్యర్థాలను వేస్ట్ టూ ఎనర్జీ ఎ÷-లాంట్లకు తరలించాలని ఆదేశించారు. తడి వ్యర్థాలను కంపోస్టు తయారు చేసేందుకు మళ్లించాలని సూచించారు. 500 పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్టులో కిచెన్ గా÷-డ్గ÷న్, బయోడైవర్సిటీలో భాగస్వాములను చేయాలని సూచించారు. వీబీజీ రామ్ జీ కింద రూ.9773 కోట్లు ఏపీకి కేటాయించారని అన్నారు. ఇప్పుడు ఈ పథకం డిమాండ్ డ్రివెన్ కాదని... దీనికి అనుగుణంగా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెట్టుబడుల గురించి ఎలా ఆలోచిస్తున్నామో... పేదలకు అందించే సంక్షేమం గురించి... వారికి కల్పించే సాధికారత గురించి కూడా కలెక్టర్లు ఆలోచించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు.

# వైసీపీ కోట్లాది ప్రజలు సొత్తు

**మొదటిపేజీ తరువాయి**

ఇప్పుడు 16వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగన్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. దివంగత నేత వైయస్ రాజశేఖర రెడ్డి మరణం తర్వాత ఆయన ఆశయాలను కొనసాగిస్తానని, ఆయన మరణాన్ని తట్టుకోలేక చనిపోయిన కుటుంబాలను పరామర్శిస్తానని జగన్ నల్లకాల్వలో ఇచ్చిన మాట ఆ పార్టీ స్థాపనకు పునాది వేసింది. ఓదార్పు యాత్రకు కాంగ్రెస్ పార్టీ అడ్డు చెప్పడంతో.. ఇచ్చిన మాట కోసం ఆ పార్టీని వదిలి, వైయస్సార్సీపీని జగన్ స్థాపించారు. 'అప్పట్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోనూ, కేంద్రంలో నూ అధికారంలో ఉన్నప్పటికీ ఎలాంటి భయం లేకుండా ప్రజల కోసం పోరాటం చేశా. మొదటి నుంచీ ప్రజలు, దేవుడ్నే నమ్ముకుని ముందుకు సాగా. వైసీపీ ఆవిర్భావం తర్వాత దేశ రాజకీయాల్లో కూడా మార్పులు కనిపించాయి. వైసీపీ కార్యకర్తలు ఎప్పుడూ గర్వంగా కాలర్ ఎగరేసేలా పార్టీ నిలుస్తుంది. ఈ పార్టీ కొన్ని కోట్ల మంది ప్రజలదని అన్నారు. అందరి ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా పార్టీ నిలిచింది. పార్టీ లోపల ఎప్పుడూ విలువలు, విశ్వసనీయతకు పెద్దపీట వేస్తాం. నాపై ప్రేమాభిమానాలు చూపుతున్న కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. వైసీపీని అభిమానించే ప్రతి ఒక్కరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు' అని వైఎస్ జగన్ తెలిపారు. ఈరోజు మరొక్కసారి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైయస్సార్‌ను అభిమానించే ప్రతి గుండెకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడికి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ కూడా ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఇంకా వైయస్సార్‌ను ప్రేమించే ప్రతి గుండె, ఏ రాష్ట్రంలో ఉన్నా, ఆ ప్రతి గుండెకు ఈరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానంటూ వైఎస్ జగన్ ప్రసంగాన్ని ముగించారు. పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ కేంద్ర కార్యాలయానికి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. వైయస్సార్ చిత్రపటానికి పూలు సమర్పించి, నివాళులర్పించిన వైఎస్ జగన్, ఆ తర్వాత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు.

# మత్స్యకారులకు అండ

**మొదటిపేజీ తరువాయి**

నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించనున్న అటానమస్ మారిటైమ్ షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ మాట్లాడుతూ, ఇది కేవలం ఒక పరిశ్రమ ప్రారంభోత్సవం కాదని, భారతదేశ సముద్ర సాంకేతిక భవిష్యత్తుకు నాంది అని అభివర్ణించారు.

దేశంలోనే రెండవ అతిపెద్ద తీరరేఖ కలిగిన ఆంధ్రప్రదేశ్‌కు సముద్రం జీవనోపాధి, వాణిజ్యం, సంస్కృతికి కేంద్రమని మంత్రి పేర్కొన్నారు. "లక్షలాది మత్స్యకార కుటుంబాలు సముద్రంపై ఆధారపడి జీవిస్తున్నాయి. వారి భద్రత, జీవనోపాధిని మెరుగుపరిచేందుకు సాంకేతికతను వినియోగించడం అత్యంత ముఖ్యం. ఈ రోజు ప్రారంభమవుతున్న ప్రాజెక్ట్ ఆ లక్ష్యాన్ని నెరవేరుస్తుంది" అని లోకేశ్ తెలిపారు.

**దేశంలోనే తొలి అటానమస్ షిప్ బిల్డింగ్ సెంటర్**

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పక్కనే 29.58 ఎకరాల విస్తీర్ణంలో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థ దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్మిస్తోందని లోకేశ్ వెల్లడించారు. ఈ కేంద్రంలో మనుషులు లేని సముద్ర నౌకలు (అటానమస్ షిప్స్), అండర్ వాటర్ వెహికల్స్, ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలు వంటి అత్యాధునిక సాంకేతికతలను అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఇవి తీరప్రాంత భద్రత, విపత్తు నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

**మత్స్యకారులకు సాంకేతిక భరోసా**

ఈ ప్రాజెక్టుపై మత్స్యకార సోదరులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. "ఈ టెక్నాలజీ దేశ రక్షణకే కాదు, మీ జీవితాలను మెరుగుపరచడానికి కూడా ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో మీకు రియల్ టైం వాతావరణ సమాచారం, చేపల గుంపులను గుర్తించడం, నావిగేషన్ సహాయం అందిస్తుంది. దీనివల్ల మీ భద్రత పెరిగి, ఇంధన వ్యయం తగ్గి, ఉత్పాదకత పెరుగుతుంది. మత్స్యకారులను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిది" అని హామీ ఇచ్చారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన సంస్థ ప్రతినిధులను కోరారు.

**జువ్వలదిన్నె హార్బర్‌తో 25 వేల కుటుంబాలకు లబ్ధి**

రూ.288.80 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా ఇప్పటికే 25 వేల మత్స్యకార కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయని మంత్రి వివరించారు. ఈ హార్బర్‌లో 1,250 మెకనైజ్డ్, మోటరైజ్డ్ పడవలను సురక్షితంగా నిలిపే సదుపాయంతో పాటు ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్‌లు, వేలం హాళ్లు, వలల మరమ్మతు యార్డులు వంటి ఆధునిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఏటా ఈ హార్బర్ ద్వారా 41 వేల టన్నుల చేపల దిగుబడి వస్తుందని, ఇది నెల్లూరు జిల్లా మత్స్య ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని అంచనా వేశారు. తుపానుల సమయంలో మత్స్యకారులకు, వారి ఆస్తులకు ఈ హార్బర్ సురక్షిత ఆశ్రయంగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.




**'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మా బలం**

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి మూడు బలమైన కారణాలు ఉన్నాయని లోకేశ్ అన్నారు. "మొదటిది ముఖ్యమంత్రి చంద్రబాబు గారి బ్రాండ్. ఆయన నాయకత్వం విశ్వసనీయతకు ప్రతీక. రెండోది, మా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'. ఇక్కడ పెట్టుబడి పెట్టాలని నిర్ణయిస్తే అది ప్రభుత్వ ప్రాజెక్టుగా మారి వేగంగా పూర్తవుతుంది. మూడోది, కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉండటం. ఈ డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్‌తో అభివృద్ధి వేగంగా సాగుతోంది. 'నమో' అంటే నాయుడుజీ, మోదీజీల కలయిక" అని ఆయన వ్యాఖ్యానించారు.సాగర్ డిఫెన్స్ సంస్థకు భారత్ బయోటెక్ వంటి సంస్థలు మద్దతు ఇవ్వడం శుభపరిణామమని లోకేశ్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఇంజనీర్లు, రోబోటిక్స్ నిపుణులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, ఏ అవసరం వచ్చినా తాను ఒక వాట్సాప్ మెసేజ్ దూరంలో ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, సాగర్ డిఫెన్స్ సీఈవో కెప్టెన్ నికుంజ్ పరాశర్ తదితరులు పాల్గొన్నారు.

# చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..?

**ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా పెత్తనం ఏంటి**

**ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో దొరికి పోవడంతోనే అమెరికాకు దాసోహం**

**లోక్‌సభలో రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు**

**న్యూఢిల్లీ,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**

భారత విదేశాంగ విధానన్ని మోడీ అమెరికాకు తకట్టు పెట్టారని విపక్షనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రష్యా నుంచి చమురు దిగుమతులకు అమెరికా అడ్డంకులేంటని ప్రశ్నించారు. మనం చమురు ఎక్కడ కొనాలో అమెరికా నిర్ణయిస్తుందంటే మన విదేశాంగ విధానం తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. హర్మూజ్ జలసంధి నుంచి పెద్ద ఎత్తున దిగుమతులు జరగాల్సి ఉంది. యుద్ధం కారణంగా దిగుమతులు ఆగిపోయాయి. ఇది ఆరంభం మాత్రమే. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది. మనం ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తోంది. రష్యా నుంచి చమురు కొనాలో..?వద్దో..? మనకు మనం నిర్ణయించుకోవాలి. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..? భారత్ వంటి పెద్ద దేశానికి మరోదేశం అనుమతి ఎందుకు..? ఇలా ఎందుకు జరుగుతోందా అని ఆలోచించాను. నా ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో దొరికింది. ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రభావం ఎల్‌పీజీ దిగుమతులపై పడినట్లు ఉంది. ఎప్‌స్టీన్‌తో సంబంధాలను పెట్రోలియం మంత్రే అంగీకరించారని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. ఇవి దుమారం రేపాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. నోటీసు ఇచ్చిన అంశంపైనే మాట్లాడాలని సూచించారు. సభ్యుల ఇష్టాఇష్టాల మేరకు సభ నడవదని స్పష్టం చేశారు. ఇదే అంశంపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. ఎప్‌స్టీన్ అంటూ లోక్‌సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆ గందరగోళం మధ్యే మంత్రి మాట్లాడారు. ఇరాన్, అమెరికా - ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతతో భారతదేశం అల్లాడుతోందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుత పరిస్థితికి మోదీ ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్నారు. అమెరికా - ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు 20 శాతం చమురు హోర్ముజ్ జల సంధి నుంచి వస్తుందని వివరించారు. ప్రస్తుతం ఆ జల సంధిని మూసివేశారని పేర్కొన్నారు. గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. దేశానికి పునాది ఇంధన భద్రత అని అభివర్ణించారు. భారత్ వ్యవహారాలను అమెరికా శాసిస్తోందని మండిపడ్డారు.

# ప్రజాసంక్షేమమే పరమావధిగా అడుగులు

**వైఎస్ఆర్‌సీపీ ప్రస్థానం ఎంతో ప్రత్యేకం**
**వైఎస్ఆర్ ఆశయాల సాధనే లక్ష్యం**
**ప్రజారంజకంగా వైసీపీ ఐదేళ్ల పాలన**
**కూటమి పాలనలో విజృంభిస్తున్న దౌర్జన్యపరులు**
**దుష్ట, దౌర్జన్య ప్రభుత్వంపై పోరాటాలు చేద్దాం**
**వైసీపీ ఆవిర్భావ వేడుకల్లో అనంత వెంకటరామిరెడ్డి**
**అనంతపురంలో ఘనంగా వైసీపీ**
**16వ ఆవిర్భావ దినోత్సవం**



వైసిపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి తదితరులు

**అనంతపురం సంక్షేమం, మార్చి 12,(రిపబ్లిక్ న్యూస్):** అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాసంక్షేమమే పరమావధిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుందని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. అనంతపురంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను అనంత వెంకటరామిరెడ్డి ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అంతకుముందు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

### బలహీన వర్గాలకు మేలు చేయాలన్న సంకల్పం

ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ వైఎస్ఆర్ మరణం తర్వాత ఏర్పడిన ప్రత్యేక పరిస్థితుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. వైఎస్ఆర్ ఆశయాలు కొనసాగించాలన్న ఆకాంక్షతో పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు చేయాలన్న సంకల్పంతో వైసీపీ అడుగులు వేసిందని తెలిపారు. ప్రతిపక్ష నేతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వైఎస్ జగన్ అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. 3648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేసి జనంతో మమేకమై వారి కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అధికారంలోకి రాగానే ఐదేళ్లలో ప్రజారంజక పాలన అందించారని తెలిపారు. కోవిడ్ వంటి పరిస్థితులు ఉన్నా ఎక్కడా సంక్షేమ పథకాలు ఆపలేదన్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయినా వైసీపీకి 45 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేసిన ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీది, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని చెప్పారు.

### అనంతలో ప్రజాప్రతినిధుల అవినీతి పెరిగిపోయింది

ఈ రోజు ప్రతిపక్షంలో ఉన్నా కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడుతున్నామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అక్రమ కేసులు పెట్టినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడడం లేదన్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటుందన్న వారందరికీ అభినందలు తెలియజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంలో తప్పుడు కేసులు పెడుతున్నారని, దౌర్జన్యపరులు విజృంభిస్తున్నారని విమర్శించారు. అనంతపురం వంటి ప్రాంతంలో ప్రజాప్రతినిధుల అవినీతి పెరిగిపోయిందన్నారు. ఎవరి ఆస్తులు ఎప్పుడు లాక్కుంటారోనన్న భయం ప్రజల్లో ఉందన్నారు. అధికార పార్టీ చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడొద్దని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్దామన్నారు. దుష్ట, దౌర్జన్య ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేస్తున్న అనంత, జిల్లా పరిషత్ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు



వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అనంత, కోటం విజయభాస్కర్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు

# నగర అభివృద్ధికి ఐదేళ్లు కృషి

**చివరి సర్వసభ్య సమావేశంలో పాలకవర్గం భావోద్వేగం**

**2026-27 బడ్జెట్‌కు ఆమోదం 72 అజెండాలకు గ్రీన్ సిగ్నల్ సభ్యులకు సత్కారం, జ్ఞాపికలు**








**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 12)** కర్నూలు నగర అభివృద్ధికి గడిచిన ఐదేళ్ల కాలంలో పాలకవర్గం ఎంతో కృషి చేశామని, ముమ్ముందు కూడా పౌరులుగా నగరాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని మేయర్ బి.వై. రామయ్యతో పాటు కార్పొరేటర్లు తెలిపారు. గురువారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో మేయర్ అధ్యక్షతన పాలకవర్గం తుది సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను సమావేశం ఆమోదించింది. అనంతరం మొత్తం 72 అజెండా అంశాలకు సభ్యులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వీధీ దీపాల ఏర్పాటు, ఆక్రమణల తొలగింపు, వెండర్ జోన్ల ఏర్పాట్లు, ట్రేడ్ లైసెన్సులు వంటి అంశాలపై సభ్యులు చర్చించారు. పాలకవర్గం చివరి సమావేశం కావడంతో మేయర్, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లను కమిషనర్ పి. విశ్వనాథ్ జ్ఞాపికలు, బ్యాగులు అందజేసి సత్కరించారు. అలాగే ప్రస్తుత పాలకవర్గంలో సభ్యులుగా ఎన్నికై అనంతరం అనారోగ్య కారణాలతో మృతి చెందిన గిప్సన్, అలాగే అనివార్య కారణాలతో పదవి కోల్పోయిన కాశిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులను కూడా సన్మానించారు.

సమావేశం అనంతరం పాలకవర్గ సభ్యులు, అధికారులు, పాత్రికేయులకు విందు భోజనం ఏర్పాటు చేశారు.

ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, నాయకల్లు అరుణ, అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి నాగ ప్రసాద్ బాబు, ఇంచార్జి సిటీ ప్లానర్, ఆర్ఓ జునైద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముగ్గురు హోంగార్డులకు రూ.4.04 లక్షల కాంట్రిబ్యూషన్‌వెల్ఫేర్ ఫండ్ చెక్కులు పంపిణీ

**ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ అందజేత**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 12)** కర్నూలు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ముగ్గురు హోంగార్డులకు హోం గార్డ్స్ కాంట్రిబ్యూషన్ మరియు వెల్ఫేర్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను గురువారం అందజేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎఆర్ అడిషనల్ ఎస్పీ కార్యాలయంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ చెక్కులను బాధితులకు అందించారు. ఈ సందర్భంగా హోం గార్డ్స్ కాంట్రిబ్యూషన్ మరియు వెల్ఫేర్ ఫండ్ నుంచి మొత్తం రూ.4,04,999 విలువైన చెక్కులను ముగ్గురు హోంగార్డులకు పంపిణీ చేశారు. ఆదోని యూనిట్‌కు చెందిన హోంగార్డు సయ్యద్ హజరత్ మున్నా పదవీ విరమణ పొందిన సందర్భంగా రూ.2 లక్షల చెక్కును అందజేశారు. కర్నూలు యూనిట్‌కు చెందిన మహిళా హోంగార్డు రాఘవేంద్రమ్మ మృతి చెందిన నేపథ్యంలో ఆమె కుమార్తె మౌనికకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. పత్తికొండ యూనిట్‌కు చెందిన హోంగార్డు అయూబ్‌కు మెడికల్ గ్రాంట్ కింద రూ.4,999 విలువైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ కె.వి.వి.ఎస్.వి. ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ శ్రీమతి కె. మాధవి రాణి, ఏఆర్ఎస్ఐలు కాంతరెడ్డి, ఎం. మహేశ్వరయ్య, పోలీసు సిబ్బంది మరియు హోంగార్డులు పాల్గొన్నారు.

# కూతురు పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేసిన తండ్రి






**గుత్తి మార్చి 12( రిపబ్లిక్ న్యూస్)** హర్షిణి ఎన్విరాన్మెంట్ సొసైటీ అధ్యక్షుడు, మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ గుత్తి ప్రెసిడెంట్ కాయపాటి నరేష్ యాదవ్ తన కూతురు హర్షిణి యాదవ్ ఐదోవ పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేయడం జరిగింది. అదేవిధంగాఎమే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ తాడిపత్రి ప్రెసిడెంట్ పల్ల శ్రీరంగ రక్తదానం చేయడం జరిగింది. బెంగళూరులోని రామయ్య మెమోరియల్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న గుత్తి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జల్లా మోహన్ రెడ్డి అనే వ్యక్తికి అత్యవసరంగా ఏ పాజిటివ్ ప్లేట్లెట్లు అత్యవసరం కాగా తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ఏదో ఒక మంచి పని చేయాలని తలంపుతో ఉన్న తనకు నిండు ప్రాణాన్ని నిలబెట్టడమే పెద్ద అవకాశం గా భావించి గుత్తి నుంచి బెంగళూరుకు వెళ్లి ఏ పాజిటివ్ ప్లేట్లెట్లను దానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పేషంట్ బంధువులు మాట్లాడుతూ మా కోసం గుత్తి నుంచి ఇంత దూరం ప్రయాణం చేసి వచ్చి రక్తదానం, ప్లేట్లెట్లను దానం చేసినందుకు ఇద్దరికీ కృతజ్ఞతలు తెలపడం జరిగినది. అదేవిధంగా నరేష్ యాదవ్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో హర్షిని ఎన్విరాన్మెంట్ సొసైటీ ప్రారంభించడం జరిగిందని గుత్తి మరియు చుట్టుపక్కల గ్రామాలలో హరిత వనాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ ఎన్విరాన్మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.నరసింహులు తదితరులు పాల్గొన్నారు..

# నేటి విద్యార్థులే దేశ భవిష్యత్తు సారథులు

**ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్. నిర్మలమురళి**





**అనంతపురం సంక్షేమం,మార్చి 12, ( రిపబ్లిక్ న్యూస్ ):** నేటి విద్యార్థులే దేశ భవిష్యత్తు వైపు నడిపించే సారథులు అని నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్. నిర్మలమురళి పేర్కొన్నారు. విద్య వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా పునాది అని అన్నారు. గురువారం హెచ్‌ఎల్‌సి కాలనీలోని పుల్లలరేవు ఆదినారాయణ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ భవనంలో నివసిస్తున్న 38 మంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తును నిర్మించే సారథులు అని పేర్కొన్నారు. విద్య ద్వారా వ్యక్తికి సమాజంలో గౌరవం, గుర్తింపు లభించడంతో పాటు సమాజ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని చెప్పారు. పేదరికం అడ్డంకి కాదని, పట్టుదలతో చదువుకుంటే ఉన్నత స్థానాలు సాధించవచ్చని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులను గౌరవిస్తూ సమాజ పరిస్థితులను అర్థం చేసుకొని స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని సూచించారు. లక్ష్య సాధనలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని విజయాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఆర్. జగదీశ్వర ప్రసాద్, ఆవాసం ప్రముఖుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# లచ్చాన పల్లి స్వచ్ఛత గ్రామంగా ఎంపిక



**గుత్తి మార్చి 12( రిపబ్లిక్ న్యూస్)** గుత్తి లచ్చానపల్లి గ్రామాన్ని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ అధికారి గురువారం మనైపాల్ సందర్శించారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, పాఠశాల, పారిశుద్ధ్యం, . సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా తీరును పరిశీలించారు. మౌలిక సదుపాయాల ఆధారంగా గ్రామాన్ని స్వచ్ఛత గ్రామంగా ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ అసోసిమేంట్ సెక్రెటరీ న్యూఢిల్లీ మైనపాల్ యం ఓ ర్ డి వినోద్ విజయవాడ డీఈవో నాగరాజు సీఈఓ శివ శంకర్ డి డి ఓ విజయలక్ష్మి ఎంపీడీవో ప్రభాకర్ నాయక్ హౌసింగ్ ఏఈ సూర్యనారాయణ సచివాలయం సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# మహిళల భద్రతపై అవగాహన

**- నర్సింగ్ కాలేజీలో ప్రత్యేక కార్యక్రమం**

**పాజిటివ్ మాస్క్యులినిటీ, హెల్ప్‌లైన్ నంబర్లు, వన్ స్టాప్ సెంటర్ సేవలపై వివరాలు**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్ట్ 12)** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా 10వ రోజు గవర్నమెంట్ డిగ్రీ నర్సింగ్ కాలేజీలో మహిళల భద్రత మరియు సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. విజయ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వన్ స్టాప్ సెంటర్‌కు చెందిన విజయ కుమారి విద్యార్థినులకు పాజిటివ్ మాస్క్యులినిటీ, మహిళల కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్లు, అలాగే వన్ స్టాప్ సెంటర్ అందిస్తున్న సేవలు గురించి వివరించారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదురైనా ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జి. శ్రీనివాసులు, ఎన్‌సీసీ సిబ్బంది షోకత్, ఎన్‌జీవోకు చెందిన మౌనిక, కాలేజీ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు దొంగే దొంగ దొంగ అన్నట్లే : గుడిసె ఆదికృష్ణమ్మ

**జగన్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది - అభివృద్ధి కార్యక్రమాలు చెప్పాలని సవాల్**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 12)**
వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు దొంగే దొంగ దొంగ అన్నట్లుగా ఉన్నాయని కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. గురువారం కర్నూలులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దెబ్బతీశారని ఆమె ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క సామాజిక వర్గానికీ న్యాయం జరగలేదని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని విమర్శించారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆమె సవాల్ విసిరారు. అధికారంలో ఉన్న సమయంలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని, అనవసర అరెస్టులు కూడా జరిగాయని గుర్తుచేశారు. జగన్ పాలనలో చెత్తపై కూడా పన్ను విధించారని, ఆ డబ్బు ప్రజలకు ఉపయోగపడలేదని ఆమె పేర్కొన్నారు. 2019లో ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు అధికారాన్ని అప్పగించగా, తరువాత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. అందుకే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పి కూటమి పార్టీలకు 164 స్థానాలు ఇచ్చారని తెలిపారు.

అధికారాన్ని కోల్పోయిన తర్వాత జగన్ మోహన్ రెడ్డి మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిలా వ్యవహరిస్తున్నారని ఆమె విమర్శించారు. ప్రజల మధ్య చిచ్చు రేపేందుకు కుట్రలు చేస్తున్నారని, తన మాటలను నమ్మి ప్రజలు మళ్లీ మోసపోరని పేర్కొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, ఉన్న పరిశ్రమలు కూడా వైసీపీ నాయకుల అరాచకాల కారణంగా ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని ఆమె ఆరోపించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని అన్నారు.

రాష్ట్ర యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలను తీసుకురావడంలో ప్రభుత్వం కృషి చేస్తోందని, అభివృద్ధిసంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తోందని ఆమె చెప్పారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

# శకునాల లోవైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ వేడుకలు ఘనంగా




**ఓర్వకల్లు ప్రతినిధి మార్చి 12, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఓరకల్ మండలం శకునాల గ్రామంలో వైఎస్ఆర్సిపి పార్టీ ఆవిర్భావం సందర్భంగా 15 సంవత్సరాలు పూర్తి చేసుకుని 16 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా ఓర్వకల్లు మండలం శకునాల గ్రామంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసిన వైయస్సార్ పార్టీ నాయకులు బీరం శివరాం పుల్లారెడ్డి, కే శివారెడ్డి, జంగం కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా



**బేతంచర్ల ప్రతినిధి, మార్చి 12,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
బేతంచెర్ల మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో గురువారం రోజున వైసిపి జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.వైసిపి అధినేత మాజీ సీఎం సంక్షేమ సామ్రాట్ అభివృద్ధి ప్రదాత శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకుయువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భవ దినోత్సవం శుభ సందర్భంగా.రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు. బేతంచెర్ల మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో వైసీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు అనంతరం వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి వెంకటరావు, కాశి మరియు వైసిపి పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# వైస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా

**కర్నూలులో పార్టీ జెండా ఆవిష్కరణ వైఎస్సార్ విగ్రహానికి నివాళి, కేక్ కట్ చేసి సంబరాలు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 12)**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా కర్నూలు జిల్లాలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయం ఎస్వీ కాంప్లెక్స్ వద్ద వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్.వి. మోహన్ రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.వి. విజయ మనోహరి, కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త బుట్టా రేణుక పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం విగ్రహం ముందు కేక్ కట్ చేసి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సంబరంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా. మధుసూదన్, కర్నూలు నగర మేయర్ బి.వై. రామయ్యతో పాటు పార్టీ జిల్లా నాయకులు, నగర కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ నీరు వినియోగిస్తున్న నర్సరీకి కనెక్షన్ తొలగించిన డిప్యూటీ ఎంపీడీవో



**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 12 రిపబ్లిక్ న్యూస్**
చౌడేపల్లి మండలం పరికిదొన పంచాయతీ పరిధిలో కె.లక్ష్మన్న నిర్వహిస్తున్న నర్సరీకి ప్రభుత్వ నీరు ఉపయోగిస్తున్నారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ ఎంపీడీవో ఎస్.ఏ.గఫూర్ ఆ గ్రామానికి వెళ్లి పరిశీలించి అక్కడ ఉన్న నర్సరీ కనెక్షన్ తొలగించి, నర్సరీని కూడా తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి బాబు, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## నేడు రైతుల అకౌంట్ల లోకి అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 12 రిపబ్లిక్ న్యూస్**
కేంద్ర ప్రభుత్వం నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అస్సాం స్టేట్ లో గౌతమి నుండి 22వ విడత పిఎంకె సార్ నిధులను ఈరోజు 5 గంటలకు విడుదల చేస్తారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడో విడత అన్నదాత సుఖీభవ నిధులను రైతుల అకౌంట్లోకి జమ చేయడం జరుగుతుంది. కావున ఈ లైవ్ కార్యక్రమాన్ని చౌడేపల్లి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు చూపించడం జరుగుతుంది. కావున ఈ లైవ్ కార్యక్రమానికి రైతులందరూ వారి వారి రైతు సేవ కేంద్రంలో వీక్షించాలని మండల వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా అంతర్గత పోటీల దినోత్సవం





**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 12 రిపబ్లిక్ న్యూస్**
అంతర్గత పోటీల దినోత్సవం సందర్భంగా చారాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధులుగా చారాల కురపల్లి గ్రామానికి చెందిన వేలూరు గిరినాథ్ ప్రకాష్, ఒక చుక్కవారిపల్లి కి చెందిన కేసీ నవీన్ బాబు లు క్రీడ ఆశీస్సులతో పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. విద్యార్థులు చేత మార్చి ఫస్ట్ చేపించారు. రిటమిక్ యాక్టివిటీస్ నిర్వహించారని పి.ఈ.టి రాజేంద్ర బాబు తెలిపారు. గిరినాథ్ ప్రకాష్, నవీన్ బాబులు మాట్లాడుతూ వ్యక్తి వికాసానికి క్రీడలు ఎంతగానో తోపడ్డాయని కాబట్టి పిల్లలు ఇప్పటి నుండి క్రీడల్లో పాల్గొనాలని తెలియజేశారు. అలాగే పాఠశాలకు మినీ ఇండోర్ స్టేడియం నిర్మించి ఇస్తామని ప్రముఖ పారిశ్రామికవేత్త వేలూరు గిరినాథ్ ప్రకాష్ హామీ ఇచ్చాడు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు నారాయణ, ఉపాధ్యాయులు సహదేవ , రిటైర్డ్ హెడ్మాస్టర్ నారాయణ, రిటైజ్ జిల్లా కమిటీ కార్యదర్శి రామచంద్ర, రిటైర్డ్ జిల్లా పిడి, పి.ఈ.టి ప్రెసిడెంట్ వెంకటేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఓర్వకల్లు రిలయన్స్ బేవరేజెస్ క్యాంప - కోల కంపెనీ ను సందర్శించిన

**వైయస్సార్సీపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి**










**ఓర్వకల్లు ప్రతినిధి, మార్చి 12,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె, తిప్పాయపల్లె మరియు శకునాల గ్రామాల పరిధిలో ఉన్న రిలయన్స్ - బేవరేజెస్ (క్యాంప)- కోల కంపెనీ లను గురువారం రోజున,సందర్శించిన కాటసాని రామభూపాల్ రెడ్డి కంపెనీ వారితో మాట్లాడుతూ స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి. పరిశ్రమల ద్వారా ప్రాంతీయ యువతకు ఉపాధి లభించేలా చర్యలు తీసుకోవాలని, స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కంపెనీ అధికారులకు సూచించారు. అలాగే కంపెనీ అభివృద్ధి కార్యక్రమాలు,స్థానిక ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి కంపెనీ వారితో చర్చించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల మరియు గ్రామ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా వైఎస్ఆర్ 16వ వేడుకలు ఘనంగా



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్మోహనరెడ్డి ఏదిఏమైనా ప్రాణసమానమైన తండ్రి దివంగత డాక్టర్ వైస్సార్ నింగికి పయనమై వెళ్ళినప్పుడు

**బేతంచెర్ల ప్రతినిధి, మార్చి 12,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఇచ్చిన మాట తప్పితే ఓటు వేయొద్దని చెప్పిన నాయకుడు ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి గురువారం రోజున వైస్సార్సీపీ పార్టీ 16 వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శేషారెడ్డి హైస్కూల్ పక్కన ఉన్న దివంగత డాక్టర్ వైస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు , ఈ కార్యక్రమంలో పాల్గొన్న,వైస్సార్సీపీ పార్టీ నాయకులు అరవేటి చంద్రశేఖర్ ( త్రికోటేశ్వర కూల్ డ్రింక్స్ ),ఈర్ల కృష్ణయ్య, బేతంచెర్ల టౌన్ ఉపాధ్యక్షుడు అడపాల తిరుమలేష్,చెవిటి శ్రీనివాసులు, వార్డ్ 2 సోషల్ మీడియా వింగ్ ప్రెసిడెంట్ బుగ్గన మధుసూదనరెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్ చేసిన ఎన్నో కార్యక్రమాల గురించి మాట్లాడుతూజయ జయహో మన జననేత వైఎస్ జగనన్న రాజ్యం!సుభిక్షంగా వర్ధిల్లాలి మరో పది కాలాల పాటు వైస్సార్సీపీ పార్టీ! ( వైస్సార్సీపీ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొనిసంక్షేమ పతకాల అమలులో,పేద, సామాన్య,బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవడంలో,మహిళల శ్రేయస్సుకు, అభివృద్ధికి పాటు పడటంలో,రైతుల పురోగతికి,సంక్షేమానికి పెద్ద పీట వేయడంలో సాటి మరేవ్వరూ మన జననేత వైఎస్ జగనన్న నాయకత్వానికి.కేవలం ప్రజలకు హామీ ఇవ్వడమే కాదుచేసి,చూపించడంలో,ప్రజల కష్టాల,కడగండ్లను తీర్చడంలో మడమ తిప్పని నేత మన ప్రియతమ మాజీ పుట్టెడు దుఃఖసాగరంలో మునిగిపోయి కూడా తన తండ్రి వైస్సార్ అశువులు బాసిన సందర్భాన్ని తట్టుకోలేక మరణించిన ఎందరో పార్టీ అభిమానుల కుటుంబాలను ఓదార్చేందుకు,వారికి అండగా ఉండేందుకు,వారికి నేనున్నాను అనే భరోసా ఇచ్చేందుకు ఓదార్పు యాత్ర చేపట్టి వేలాది కిలోమీటర్లు పాదయాత్ర చేసి పేద,సామాన్య, బడుగు,బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి పట్ల తన అంకితభావాన్ని,చిత్తశుద్ధిని వ్యక్తం చేయడమే కాదు తాను అధికారం లోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తన తండ్రి దివంగత డాక్టర్ వైస్సార్ లా ఒక మంచి పరిపాలన దక్షకుడిగా అనంత పేరు,ప్రఖ్యాతలు గడించారు మన జనం మెచ్చిన జన హృదయనేత వైఎస్ జగనన్న .ఏమైనా పేద, సామాన్య,బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి,రైతుల పక్షపాతి తన తండ్రి అయిన దివంగత డాక్టర్ వైస్సార్ అడుగుజాడల్లో నడవాలనే ఏకైక లక్ష్యం తో వైస్సార్సీపీ పార్టీని స్థాపించి ఆ పార్టీని అత్యంత సమర్థవంతంగా ముందుకు నడిపించి నేటికి 16వసంతాలు పూర్తి అయిన ఈ ప్రత్యేక సందర్భంగా మన ప్రియతమ మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి కి,రాష్ట్ర వ్యాప్తంగా వున్న వైస్సార్సీపీ పార్టీనాయకులకు,కార్యకర్తలకు,అభిమానులకు ఇవే నా అభిమాన, ఆత్మీయులకు శుభాకాంక్షలు!

# ఘనంగా 16వ వసంతంలోకి అడుగుపెట్టిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

**బేతంచెర్ల ప్రతినిధి, మార్చి 12,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
బేతంచెర్ల పట్టణంలోని గురువారం రోజున వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైసిపి జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వైసిపి అధినేత మాజీ సీఎం సంక్షేమ సామ్రాట్ అభివృద్ధి ప్రదాత శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకుయువజన శ్రామిక రైతు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భవ దినోత్సవం శుభ సందర్భంగా. రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు. బేతంచెర్ల పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా వైసీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు అనంతరం శేషారెడ్డి హై స్కూల్ దగ్గర వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ





కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన,నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ జ౹౹ చలం రెడ్డి, మండల సీనియర్ నాయకులు బుగ్గన చంద్ర రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మూర్తు జావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఖాజా హుస్సేన్, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, టౌన్ కన్వీనర్ పిట్టల షేక్ జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్లు, మాజీ వార్డ్ మెంబర్లు, వైసిపి వివిధ అనుబంధ విభాగం పార్టీ విభాగం అధ్యక్షులు ఉపాధ్యక్షులు గ్రామ అధ్యక్షులు ఉపాధ్యక్షులు మాజీ తాజా వివిధ చైర్మన్లు వైయస్సార్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# రాహుల్ గాంధీపై బీజేపీ అసత్య ప్రచారం ఆపాలి

**: క్రాంతి నాయుడు**

**ప్రధానమంత్రి రాజీ పడ్డారా?**

**దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్**

**ధరల పెరుగుదలపై కేంద్రాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 12)**
పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలను కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బి. క్రాంతి నాయుడు బోయ తెలిపారు. బుధవారం కర్నూలులోని కళా వెంకట్రావు భవనంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నేతపై అటువంటి వ్యాఖ్యలు చేయడం ఖండనీయమన్నారు.
ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు, దేశంలో పెరుగుతున్న ధరల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న వైఖరి ఆందోళన కలిగిస్తోందని ఆయన అన్నారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ ధరను రూ.60 పెంచడం ప్రజలపై మరింత భారమని పేర్కొన్నారు. దేశానికి చమురు నిల్వలు ఉన్నప్పటికీ విదేశాల నుంచి దిగుమతులపై ఆధారపడడం ఎందుకని ప్రశ్నించారు. పెట్రోలు ధరలు రూ.110, డీజిల్ రూ.100 వరకు ఉండటం ప్రజలకు భారంగా మారిందని అన్నారు. రైతులు భారీగా పత్తి పంట పండిస్తున్నప్పటికీ అమెరికా నుంచి కాటన్ దిగుమతి చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని కేంద్రాన్ని ప్రశ్నించారు.
రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన "సూపర్ సిక్స్" హామీలలో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తున్నదన్నారు.
అలాగే రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు, ప్రత్యేక హోదా, రాష్ట్రానికి రావాల్సిన నిధులపై రాష్ట్రానికి చెందిన ఎంపీలు పార్లమెంట్‌లో గట్టిగా మాట్లాడాలని ఆయన సూచించారు. ఈ అంశాలను కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలు చేపడతామని క్రాంతి నాయుడు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం. సుధాకర్ బాబు, ఐఎన్టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఖాద్రి పాషా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎన్సీ బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షుడు ఆర్. ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు జాన్ సదానందం, ప్రభాకర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ పై యుద్ధాన్ని తక్షణమే ఆపండి

**:- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం.నాగేశ్వరావు**

**పాములపాడు మార్చి 12 రిపబ్లిక్ న్యూస్:-**
అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదం నశించాలని, ఇరాన్ పై చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపేయాలని, ప్రజలు, కార్మికులు, రైతుల ప్రయోజనాలను కాపాడాలని, దురాక్రమణ దాడి చేసి యుద్ధానికి దిగడంపై అత్యంత హేయమైన చర్య అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు అన్నారు. గురువారం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో, మండల కమిటీ సమావేశం మేకల రాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ ఆసియా ప్రాంతంలో పెట్రోలియం ముడి చమురు, గ్యాస్, సహజ వనరులను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి అమెరికా ఈ పన్నాగం పన్నిందని ఆయన ఆరోపించారు వంటగ్యాస్ ధర పెరగడంతోపాటు బ్లాక్ మార్కెటింగ్ వల్ల సిలిండర్లు దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయని అలాగే పట్టణాల్లో హోటల్లో మూతపడుతున్నాయని దీంతో వాణిజ్య రంగం కుంటుపడుతుందన్నారు. యుద్ధం పరిస్థితి ఇలాగనే కొనసాగితే రానున్న రోజుల్లో సాధారణమైన తోపుడు బండ్లు చిన్నాచితక హోటల్లు నిర్వాహకులు బతుకులు




బజారున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతులు లేకపోవడం వల్ల వాడి ధరలు అమాంతంగా పడిపోతున్నాయని వాటిని కొనడానికి వ్యాపారస్తులు ముందుకు రావడం లేదన్నారు. యుద్ధం వల్ల సరుకు రవాణా ప్రజా రవాణా కూడా భారం అవుతుందన్నారు. అసంఘటిత కార్మికులు, నిరుద్యోగులకు లభించే టి, టిఫిన్, భోజనం సరసమైన ధరకు దొరక్కుండాపోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు అమాంతంగా పెరుగుతాయని వార్తలు వస్తున్నాయని దాంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. గల్ఫ్ దేశాలకు ఎగుమతులు ఆగిపోవడంతో గుడ్లు, ఆక్వారంగం, పండ్లు, బియ్యం, సరుకు నిలువలు పేరుకుపోతున్నాయని, వ్యాపారస్తులు రైతుల నుండి వీటి ధరలు తగ్గించి కొంటున్నరన్నారని, దీంతో రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. అంతేకాక ఉపాధి హామీ కూలీలకు సర్వర్ సమస్యల వల్ల ఫేస్ రికగ్నైజ్డ్ హాజరు పడడం లేదని దానివల్ల కూలీలు రోజువారీ వేతనాన్ని కోల్పోతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలా కాకుండా పాతవిధానమైన మస్టర్ విధానాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. యుద్ధం ఇలాగనే కొనసాగితే రానున్న రోజుల్లో భయంకరమైన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి డి.స్వామన్న, రంగస్వామి, ఏసేపు, రామకృష్ణ, బి.రమణమ్మ, తదితర నాయకులు పాల్గొన్నారు.

# క్రైస్తవుల హక్కుల కోసం కృషి చేస్తాం : డాక్టర్ కోలా ప్రసాద్



మాట్లాడుతున్న డాక్టర్ కోలా ప్రసాద్



మాట్లాడుతున్న అపో. సిల్వి శిలోయం.. సూర్యాపేట

**అనంతపురం సంక్షేమం, మార్చి 12,( రిపబ్లిక్ న్యూస్ ):**
క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ క్రైస్తవ సమాజం పక్షాన నిలబడి కృషి చేస్తామని యునైటెడ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఇండియా కౌన్సిల్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ కోలా ప్రసాద్ తెలిపారు. గురువారం పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 69వ సర్వసభ్య సమావేశం అనంతపురంలోని యేసు కృపా మందిరంలో నిర్వహించారు.

**హక్కుల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి**

ఈ సమావేశం అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పాస్టర్ వి. మనష్షే ప్రార్థనతో ప్రారంభమైంది. అనంతరం దైవ సేవకులు గీతాలు ఆలపించి దేవుని స్తుతించారు. పాస్టర్ జాన్ ఆరాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కోలా ప్రసాద్ క్రైస్తవ సమాజ అభివృద్ధి కోసం తమ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. క్రైస్తవ హక్కుల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వాక్యోపదేశకులు పాస్టర్ కె. సిల్వి సిలోయం "దర్శనం" అనే అంశంపై ప్రసంగిస్తూ దర్శనం ఉన్న వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదుగుతాడని తెలిపారు. బైబిల్‌లోని యోసేపు, ఏలియా, ఎలీషా ప్రవక్తల జీవితాలను ఉదాహరణగా పేర్కొన్నారు.

**అతిథులకు సత్కారం, మోమెంటో అందజేత**

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రెవ. బందెల రాజు, గౌరవ అతిథి రెవ. బెంజమిన్ (బెంగళూరు), వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ పి. మార్క్, సెక్రటరీ పాస్టర్ జి.ఆర్. ఆనంద్, జాయింట్ సెక్రటరీ పాస్టర్ వి. మనష్షే, ట్రెజరర్ పాస్టర్ కె. జీవన్ బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాస్టర్ జాషువా జహంగీర్, పాస్టర్ శాంత వర్ధన్, పాస్టర్ లాబాన్, పాస్టర్ విజయ్ సింహ తదితరులు పాల్గొన్నారు. పాస్టర్ శామ్యూల్ సుభాష్ ప్రార్థించగా, పాస్టర్ జాషువా జహంగీర్ ఆశీర్వాద ప్రార్థన నిర్వహించారు. అనంతరం అతిథులను శాలువాలతో సత్కరించి, మొమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రేమ విందుతో సమావేశం ముగించారు.

# చిరంజీవిని కలసిన దిల్‌రాజు, ప్రియాంక

## గద్దర్ అవార్డుల ఫంక్షన్‌కు ఆహ్వానం



హైదరాబాద్,**మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)** : తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా మెగాస్టార్ చిరంజీవిని తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక కోరారు. అలాగే గద్దర్ అవార్డును స్వీకరించాల్సిందిగా అభ్యర్థించారు. గురువారం మెగాస్టార్ చిరంజీవి వీరు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక 'ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు' ను స్వీకరించాల్సిందిగా వారు చిరంజీవిని సాదరంగా ఆహ్వానించారు. మార్చి 19, హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా జరగనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి విచ్చేసి, ఈ గౌరవాన్ని అందుకోవాలని వారు కోరారు.

----------------

# కాలుష్య నివారణకు చర్యలు

## జిల్లాకు 350ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు

తిరుపతి,**మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)** కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా జిల్లాకు 350ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాయి. మంగళం 1, 2 డిపోలుగా విభజించి 50చొప్పున బస్సుల నిర్వహణ బాధ్యతలను వేర్వేరు ప్రైవేట్ సంస్థలకు అప్పగించనున్నారు. తొలివిడతగా నాలుగునెలల్లో 50 ఈకా ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. వీటికి పినాకిల్ ఈ-మొబిలిటీ సంస్థ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుంది. తాజాగా మంగళం డిపోకే మరో 50బస్సులు కేటాయించడంతో ఆ డిపో పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్‌గా మారనుంది. దాంతో బస్సుల కొనుగోలు, మౌలికసదుపాయాల ఏర్పాట్లకు నిధుల కేటాయింపుల్లో కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం భరిస్తాయి. ఈ క్రమంలో మంగళం డిపో నిర్వహణ బాధ్యతల నుంచి ఆర్టీసీ పూర్తిగా విరమించుకున్నట్లే. కాగా మంగళం డిపోలో ఎలక్ట్రిక్ బస్సు రీచార్జింగ్ స్టేషన్ కోసం రూ.7.6కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. ఎస్పీడీసీఎల్ సంస్థ అండర్‌కేబుల్, ట్రాన్స్‌ఫార్మర్ వంటి పనులను మొదలుపెట్టనుంది. అదే విధంగా ప్రాంగణంలో సివిల్‌వర్క్స్, చార్జింగ్‌మిషన్‌ల అమరిక వంటి మౌలిక వసతులకు రూ.6.3కోట్లు కేటాయించారు. పనుల టెండర్ పక్రియ ఈ నెల్లోనే పూర్తికానుంది. రెండో విడతలో తిరుమల డిపోకు 100, శ్రీకాళహస్తి డిపోకు 100, పుత్తూరు డిపోకు 50 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. దాంతో తిరుమలకు పూర్తిస్థాయిలో ఈవీ బస్సులే నడవనున్నాయి.

--------------

# తిరుమలలో అరుదైన పచ్చనాగు పాము ప్రత్యక్షం

తిరుమల,**మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)** : తిరుమలలో అరుదైన పచ్చ నాగుపాము కనిపించింది. సాధారణంగా నాగుపాములు బూడిద రంగులో ఉంటాయి. అయితే తిరుమలలో మాత్రం బుధవారం సాయంత్రం పచ్చ రంగులో ఉన్న నాగుపాము ప్రత్యక్షమై అందరినీ అశ్చర్యపరిచింది. రెండడుగుల పొడవు మాత్రమే ఉన్న ఈ పాము సాధారణ నాగుపాముల తరహాలోనే పడగతో కనిపించగా అక్కడి సిబ్బంది పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కరనాయుడికి సమాచారమిచ్చారు. వెంటనే ఆయన అక్కడికి చేరుకుని పామును పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు. ఈ అరుదైన పాము నాగుపాము జాతికి సంబంధించినదేనని, అత్యంత విషపూరితమైనదని భాస్కర నాయుడు తెలిపారు.

----

# ఇరాన్‌పై వెంటనే యుద్ధాన్ని ఆపాలి

## అమెరికా తీరుకు వ్యతిరేకంగా లెఫ్ట్ ర్యాలీ




విజయవాడ,**మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)** : అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదం నశించాలని కోరుతూ లెఫ్ట్ పార్టీలు విజయవాడలో ర్యాలీ నిర్వహించాయి. ఇరాన్‌పై చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపేయాలని, డిమాండ్ చేశాయి. అమెరికా దుందుడుకు ,నిరంకుశ విధానాలతో ప్రపంచం యావత్తూ తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. అమెరికా నిరంకుశ విధానాలను నశించాలంచాలంటూ నినాదాలు చేశారు. ప్రజలు, కార్మికులు, రైతుల ప్రయోజనాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆధ్వర్యాన గురువారం విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి..అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి.. యుద్ధం వద్దు.. శాంతి ముద్దు అని నినదించారు. ఈ ర్యాలీలో ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు.

----------------

# కోకాపేటలో అల్లు సినిమాస్ మల్టీప్లెక్స్

## లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేవంత్

## హాజరైన సినీ, రాజకీయ దిగ్గజనేతలు





హైదరాబాద్,**మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
హైదరాబాద్ కోకాపేటలోని 'అల్లు సినిమాస్' మల్టీప్లెక్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్యమంత్రికి నటుడు అల్లు అర్జున్ స్వాగతం పలికారు. మల్టీప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన అల్లు రామలింగయ్య విగ్రహానికి సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులర్పించారు. 'అల్లు సినిమాస్'లోని ఏర్పాట్లను అల్లు అరవింద్, అల్లు అర్జున్ వివరించారు. అనంతరం డాల్బీ స్క్రీన్‌లో ప్రదర్శించిన పలు ప్రచార చిత్రాలను వీక్షించారు. ఈ ఈవెంట్‌లో దర్శకులు రాఘవేంద్రరావు, బోయపాటి శ్రీను, క్రిష్, నందినిరెడ్డి, పలువురు నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు. 'అల్లు సినిమాస్'లో నాలుగు స్క్రీన్లు ఉండగా.. స్క్రీన్-1లో డాల్బీ విజన్ సౌలభ్యం ఉంది. ఇది ఆసియాలోనే అతి పెద్దదిగా 75 అడుగులు ఉంటుంది. ఉగాది సందర్భంగా ఈ మల్టీప్లెక్స్‌లో సినిమాలు ప్రదర్శన ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి 'బుక్ మై షో' వేదికగా బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి. 'ధురంధర్: ది రివెంజ్' మూవీ ప్రీమియర్స్‌తో ప్రేక్షకులకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. అంతకుముందు గురువారం సాయంత్రం ఈ వేడుక సినీ, రాజకీయ నాయకుల సమక్షంలో గ్రాండ్ గా జరిగింది.

# చిప్పగిరి లో వైసీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం





**చిప్పగిరి మార్చ్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
స్థానిక అంబేద్కర్ సర్కిల్ నందు చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య ఆధ్వర్యంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ గురువారం వైయస్సార్ పటానికి పూలమాలవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగింది, విజయవంతంగా 15 వసంతాలు పూర్తి చేసుకుని 16 వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు,మండల కన్వీనర్ మారయ్య మాట్లాడుతూజగనన్న మాటే మాకు శాసనం, జన సంక్షేమ పథకాలే మాకు మార్గదర్శనం, పార్టీ శ్రేణులు జగన్ నాయకత్వాన్ని బలపరుస్తూ ఉపయోగించే ప్రధాన నినాదం అని,విశ్వసనీయతకు మారుపేరు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని పార్టీ తన విలువలు మరియు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడాన్ని మన జెండా ప్రజల అజెండా ప్రజల ఆకాంక్షలే పార్టీ ధ్యేయమని తెలిపారు,15 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో మా వెంట నడిచిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు ,ఈరోజు ప్రత్యేక రోజున జగన్ మోహన్ రెడ్డి కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతు.దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధన కోసం పుట్టిన ప్రజల పార్టీకి ఇవే మా వందనాలు అని,జై జగన్ ,జోహార్ వైయస్ఆర్ప్రజల కోసం పుట్టిన ప్రజల పార్టీ వైయస్ఆర్ సీపీ,ధైర్యానికి చిరునామా భరోసా కు కేరాఫ్ అడ్రస్ మన వైయస్ఆర్ సీపీ జెండా అని కొనియాడారు, ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేష్, అసెంబ్లీ బూత్ కన్వీనర్ లోక్నాథ్ , ఎక్స్ ఎంపీటీసీ మల్లికార్జున, చిప్పగిరి మండల కో కన్వీనర్ కొండ శేఖర్, కాజీ పురం నాగరాజు, బెల్డోన అంజి, మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్య అనుచరుడి పాడె మోసిన వైకుంఠ మల్లికార్జున చౌదరి



**చిప్పగిరి, మార్చి,12,( రిపబ్లిక్ న్యూస్)** ఆలూరు మండలం అరికెర గ్రామంలో వైకుంఠ మల్లికార్జున చౌదరి ముఖ్య అనుచరుడు కుప్ప గంట ఈరన్న గురువారం మృతి చెందారు, ఈరన్న భౌతిక గాయంతో పూలగుచ్చం ఉంచి నివాళులర్పించారు, కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు, అనంతరం జరిగిన అంతిమయాత్రలో పాడే మోసి తన ముఖ్య అనుచరుడు పట్ల ఉన్న ఆత్మీయతను అనుబంధాన్ని చాటుకున్నారు, ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గుర్రం దేవేంద్రప్ప, ఉమాపతి చౌదరి, గుర్రం అనిల్, ఎస్.కె. జహీర్ ,గౌతమ్ నాయుడు, అమర్ ,దాసరి కృష్ణ ,తదితరులు పాల్గొన్నారు

# అరికెర గ్రామం లో టిడిపి నాయకుడు మృతి





**చిప్పగిరి, మార్చి, 12 (రిపబ్లిక్ న్యూస్)** ఆలూరు మండలం అరికెర గ్రామంలో టిడిపి నాయకుడు మృతి చెందారు పార్థివ దేహానికి నివాళులు అర్పించిన ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, తెలుగుదేశం మాజీ ఇంచార్జి వీరభద్ర గౌడ్,గురువారం ఆలూరు మండలం అరికెర గ్రామ సర్పంచ్ నాగరాజు తండ్రి కుప్పగల్లు ఈరన్న అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ ఆలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ వారి నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు . ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా వైస్సార్సీపీ 16 వ ఆవిర్భావ దినోత్సవం

**చిప్పగిరి, మార్చి, 12,( రిపబ్లిక్ న్యూస్)**
ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆధ్వర్యంలో ఘనంగా వైఎస్సార్సీ 16 వ ఆవిర్భావ దినోత్సవం గురువారం జరిగింది, ఎమ్మెల్యే బుసినే వీరపాక్షి మాట్లాడుతూ దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధన కోసం ఆయన పాదాల చెంత 2011 మార్చి 12 న వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ పార్టీనీ స్థాపించారు అని,నేడు పార్టీ విజయవంతంగా 15 సంవత్సరాలు పూర్తి చేసుకొని 16 వ సంవత్సరంలోకి అడుగు పెడుతోంది అని తెలిపారు,ఈ ప్రయాణంలో అనేక పోరాటాలు, అనేక విజయాలు,పోరాటాలు మధ్య పుట్టి ప్రజల ఆశీర్వాదాలతో ఎదిగిన ప్రజా పార్టీ వైయస్ కాంగ్రెస్ పార్టీ అని,ఇది కేవలం ఒక్క పార్టీ జండా కాదు, కోట్లాది మంది ప్రజలు తమ భుజా లెత్తి మోస్తున్న జండా అని, 16వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో





పార్టీని మరింత బలోపేతం చేయాలని అని ,ప్రజల ఆశయ మే ఊపిరిగా, వారి భవిష్యత్తే లక్ష్యంగా కదులుతున్న అజేయమైన శక్తికి నిలువుటద్దం ఈ వైయస్ఆర్ సీపీ జెండా అని, రైతుల కోసం పుట్టిన పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక్క వైస్సార్సీపీ పార్టీ నే అని, రైతుల పక్షాన నిలబడిన పార్టీ వైఎస్ఆర్సిపి పార్టీ అని,ఎన్నో కష్టాలు ఎదుర్కొని వైఎస్ఆర్సిపి పార్టీ అధికారంలో వచ్చి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఒక్క వైస్సార్సీపీ పార్టీ కే చేదుతుంది అని,అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న నిరంతరం ప్రజల పక్షాన నిలబడిన పార్టీ వైస్సార్సీపీ పార్టీ అని అన్నారు ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# తొలి వేతనం..

## విద్యార్థుల భవిష్యత్తుకు అంకితం

### దాతృత్వంతో పరిమళించిన బల్ల పల్లవి సేవ

### సరస్వతి పూజతో విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



**అనంతపురం ఎడ్యుకేషన్, మార్చి12,( రిపబ్లిక్ న్యూస్ ):**
పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే పరీక్షల సామాగ్రిని బల్ల పల్లవి చేతుల మీదుగా అందజేశారు. గురువారం రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ బల్ల పల్లవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి**

పదవి అంటే అధికారానికి మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే బాధ్యత కూడా. ఆ బాధ్యతను గుర్తించి అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ తొలి మహిళా చైర్‌పర్సన్ బల్ల పల్లవి తన పదవితో వచ్చిన తొలి వేతనాన్ని విద్యార్థుల భవిష్యత్తుకు అంకితం చేసి ప్రత్యేక ఆదర్శంగా నిలిచారు. ముందుగా సరస్వతి పూజ నిర్వహించి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పరీక్షలకు ఉపయోగపడే ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు తదితర విద్యా సామగ్రిని సుమారు 160 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది.

**నేటి విద్యార్థులే రేపటి దేశ నిర్మాణ సారధులు**

ఈ సందర్భంగా బల్ల పల్లవి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల జీవితంలో ఇది అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. ఈ సమయంలో వారికి అందించే చిన్న ప్రోత్సాహం కూడా భవిష్యత్తులో పెద్ద విజయాలకు మార్గం సుగమం చేస్తుందన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు నిర్మాణ సారధులన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.
పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆమె అభినందిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు వారు బలమైన పునాదులు వేస్తున్నారని తెలిపారు. గతంలో పాఠశాల ఉత్తీర్ణత శాతం సుమారు 60 శాతం ఉండేదని, ఈసారి 80 శాతం పైగా సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని వెల్లడించారు. సేవాభావంతో తన తొలి వేతనాన్ని విద్యార్థుల కోసం వినియోగించిన బల్ల పల్లవి సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. చిన్న సహాయం కూడా విద్యార్థుల్లో పెద్ద ఆశలను, ఆత్మవిశ్వాసాన్ని నింపగలదని స్పష్టంగా తెలియజేశారు.

# టూవీలర్‌ను ఢీకొన్న కారు: వ్యక్తి మృతి

**విజయవాడ,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎన్నెస్పీ కాలనీ వద్ద జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడు చాట్ల వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా.. కారు రహదారి పక్కన ఉన్న ఓ దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దుకాణం వద్ద ఉన్న ఇద్దరు గాయపడగా.. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను మైలవరం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

----

# ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్

**17 బెంచ్‌లతో కేసుల సామరస్య పరిష్కారం - ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి -జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 12)**
ఈ నెల 14వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు.బుధవారం స్థానిక కోర్టు కాంప్లెక్స్‌లోని న్యాయ సేవ సదన్‌లో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (న్యూ ఢిల్లీ) మరియు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (అమరావతి) ఆదేశాల మేరకు, జిల్లా జడ్జి జి.కబర్ధి సూచనలతో ఈ నెల 14వ తేదీన (రెండవ శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. కేసులను త్వరగా పరిష్కరించి ప్రజలు సంతోషంగా ఇంటికి వెళ్లేలా చూడాలనే ఉద్దేశంతో మొత్తం 17



బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.చిన్నపాటి గొడవలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, వైవాహిక వివాదాలు, ఇన్సూరెన్స్, బ్యాంక్ కేసులు, భార్యాభర్తల మధ్య తగాదాలు, మెయింటెనెన్స్ కేసులు, ఆస్తి పంపకాల (పార్టిషన్) కేసులు వంటి అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న కేసులను సీనియర్ జడ్జిలు, అడ్వకేట్ల సమక్షంలో చర్చించి సామరస్యంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ మంచి వేదిక అని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరగా పరిష్కారమవడంతో పాటు కోర్టు ఖర్చులు కూడా చాలా తక్కువగా ఉంటాయని చెప్పారు. సాధారణ కోర్టు కేసుల్లో ఒకరు గెలిచి మరొకరు ఓడిపోతారని, ఓడిపోయిన వారు అప్పీలుకు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే లోక్ అదాలత్‌లో తీసుకున్న నిర్ణయానికి అప్పీల్ అవకాశం ఉండదని, సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు.కాబట్టి, వివాదాల్లో ఉన్న కక్షిదారులందరూ ఈ జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కోరారు.

# జలాలు సమృద్ధిగా ఉన్నా పంట కాలువలు లేక

# లక్షల ఎకరాలు నీటి కోసం ఎదురుచూపులు

**పంట కాలువలు నిర్మిస్తే వచ్చే ఏడాదికే 5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సాధ్యం**

**నంద్యాల మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
దశాబ్దాలుగా సాగు, త్రాగు నీటి కోసం అల్లాడుతున్న రాయలసీమ గడ్డపై పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రజలలో చైతన్య స్ఫూర్తిని నింపేలా గేయాలను విడుదల చేసిన రాయలసీమ సాగునీటి సాధన సమితి నేడు మరో గళాన్ని విప్పింది. ఈ సందర్భంగా రాయలసీమ రైతుల ఆవేదనను, పాలకుల ప్రాధాన్యత లోపాలను ఎండగడుతూ రూపొందించిన ఒక ప్రత్యేక ఆడియో గీతాన్ని నంద్యాల సమితి కార్యాలయంలో సమితి కోశాధికారి చెరుకూరి వెంకటేశ్వర నాయుడు గారితో గురువారం విడుదల చేసింది.
ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. "తెలుసుకో నాయకా.. ఏది ముందో ఎరగరా.. ప్రాధాన్యత పనులు పక్కన పెట్టి పాలన సాగిస్తే ప్రయోజనం ఏమిరా?" అంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు పొంతన లేదని సమితి కార్యవర్గ సభ్యులు విమర్శించారు. కృష్ణా నదిలో నీళ్లున్నా, ప్రాజెక్టులు పూర్తయ్యాయని పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నా, పొలాల దాకా నీరు చేరకపోవడానికి కారణం పంట కాలువల నిర్మాణం పూర్తికాకపోవడమేనని వారు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపారు. గోదావరి - బనకచర్ల అనుసంధానం అంటూ కోటలు దాటే మాటలు



చెబుతున్న పాలకులు, కనీసం గొంతెండిపోతున్న ప్రజలకు త్రాగునీరు కూడా అందించలేకపోవడం ఉట్టి ఎక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కినట్లు ఉందంటూ ఎద్దేవా చేశారు.తడారిన గొంతులు, ఎండిన పంట పొలాలు సీమ విషాదానికి నిదర్శనాలనీ.. త్రాగునీటి కోసం మహిళలు పడుతున్న మానసిక వేదనను ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి చూడాలని డిమాండ్ చేశారు.జలసంరక్షణ చేస్తేనే రాయలసీమకు వెలుగు అనీ.. పాలకులు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, కాలువల నిర్మాణం పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చినప్పుడే అది నిజమైన పాలన అనిపించుకుంటుందని హితవు పలికారు. రాయలసీమ ప్రాజెక్టులకు వెంటనే నిధులు కేటాయించి, పెండింగ్‌లో ఉన్న పంట కాలువల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, రాయలసీమ గుండెల్లో ఆశలు నింపేలా నిజమైన జలకళను తీసుకురావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.
ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి పట్నం రాముడు, మహేశ్వరరెడ్డి, కొమ్మా శ్రీహరి, కృష్ణమోహన్ రెడ్డి, జానో జాగో మహబూబ్ భాష, నిట్టూరు సుధాకర్ రావు, రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత ఓటు నమోదు పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం

**కల్లూరు మండలంలోని మూడు డిగ్రీ కళాశాలలో మూడు రోజుల ప్రత్యేక డ్రైవ్ పాల్గొన్న జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 12)**
138- పాణ్యం నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మరియు కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. మార్చి 10 నుండి 12 వరకు కల్లూరు మండలంలోని రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాల, కెవి. సుబ్బారెడ్డి మహిళా కళాశాల, సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించారు. 17, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా సీఈఓ ఆంధ్రప్రదేశ్ అధికారిక వెబ్‌సైట్ మరియు ఓటర్ పోర్టల్ ద్వారా ఎలా ఓటరు నమోదు చేసుకోవాలో డిగ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమార్ గురువారం సాయికృష్ణ డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థులతో సమావేశమై ఓటరు నమోదు ప్రక్రియపై వివరించారు.
ఈ కార్యక్రమంలో సాయికృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ జానీ భాష, కళాశాల సిబ్బంది, కల్లూరు మండలం తహసీల్దార్ కె. ఆంజనేయులు, ఎలెక్షన్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీమతి జి. అనురాధ, వీఆర్వోలు రామకృష్ణ, ఇస్మాయిల్, బీఎల్వోలు పాల్గొన్నారు.

# బనగానపల్లెలో వైఎస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ



**బనగానపల్లె, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్)**
బనగానపల్లె నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ 15 సంవత్సరాలు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా బనగానపల్లె పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జెండాను బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో కష్టాలు మరియు సవాళ్లను ఎదుర్కొంటూ వైఎస్సార్సీపీ పార్టీ 15 సంవత్సరాల ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుందని తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్సీపీ అని పేర్కొన్నారు. గత 15 ఏళ్లలో ఎన్నో అడ్డంకులను అధిగమించి అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. అలాగే గత రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలతో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఆరోపించారు. అయినప్పటికీ అధికార పార్టీ ఒత్తిడులను తట్టుకుని, అక్రమ కేసులకు భయపడకుండా పార్టీ జెండాను మోస్తున్న ప్రతి వైఎస్సార్సీపీ నాయకుడు, కార్యకర్తకు సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మళ్లీ వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే 2029 ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# నారాయణ విద్యాసంస్థలపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

**చైర్మన్ నారాయణ, ఏజీఎం రమేష్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి - గాయపడిన విద్యార్థికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 12)**
కర్నూలు పట్టణంలోని నారాయణ కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల చైర్మన్ నారాయణ, ఏజీఎం రమేష్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, ఏఐఎస్ఎఫ్ నాయకులు అభి, అశోక్, బీసీఎస్సీఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య నాయకుడు శేఖర్ నాయుడు, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఉదయ్ కుమార్, పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు పట్టణంలోని నారాయణ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రాణాలకు సరైన భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. గత నెలలో పాఠశాలలో ఫ్యాన్ పడిపోవడంతో ఒక విద్యార్థి తలకు తీవ్ర గాయం అయిన ఘటన ఇంకా మరువకముందే, నారాయణ సెంట్రల్ క్యాంపస్‌లో విద్యార్థుల మధ్య జరిగిన గొడవలో మరో విద్యార్థి తీవ్రంగా గాయపడి ఒక బీజాన్ని కోల్పోయిన ఘటన జరిగిందని తెలిపారు.



విద్యార్థులు గొడవపడుతున్నప్పటికీ అక్కడ ఉన్న పాఠశాల పర్యవేక్షకులు స్పందించలేదని, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వారు విమర్శించారు. అడ్మిషన్ సమయంలో తల్లిదండ్రులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ, విద్యార్థుల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు.
గొడవలో గాయపడి ఒక బీజాన్ని కోల్పోయిన 9వ తరగతి విద్యార్థి రామ్ చరణ్‌కు నారాయణ పాఠశాల యాజమాన్యం రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్న పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు.
కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై జిల్లా విద్యాశాఖ యంత్రాంగం తక్షణమే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శీను, సాయి, అలాగే కిట్టు, ప్రవీణ్, ప్రేమ్ కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాప్ జెమినీ సీఈవో ఐమాన్ ఎజత్‌తో లోకేశ్ భేటీ

## విశాఖలో సంస్థ ఏర్పాటుపై చర్చలు

## విశాఖ టిడిపి ఆఫీస్‌లో లోకేశ్ ప్రజాదర్బార్

**విశాఖపట్నం,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**
క్యాప్ జెమినీ గ్లోబల్ సీఈవో ఐమాన్ ఎజత్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖలో క్యాప్ జెమినీ సంస్థ ఏర్పాటుపై చర్చించారు. ఇప్పటికే మధురవాడ ఐటీ పార్కుల్ హిల్-1పై 20 ఎకరాల భూమిని ఈ సంస్థ కోసం పరిశీలించారు. అడివివరం, ఆనందపురం పరిధిలో రెండు చోట్ల సంస్థ ప్రతినిధులు



భూములను పరిశీలించారు. తాత్కాలిక కార్యకలాపాలకు సెంట్రల్ పార్కు సమీపంలో ఓ ప్రైవేటు భవనాన్ని ఎంపిక చేశారు. అలాగే విశాఖ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఐటి సంస్థలకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నామని అన్నారు. ఇకపోతే మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నం జిల్లాలో గురువారం పర్యటించారు. విపలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 83వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. లోకేశ్ దృష్టికి ప్రజలు పలు సమస్యలను తీసుకువచ్చారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అన్నివిధాలా అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు.

----------------

# ఎపి జెన్కో రికార్డు విద్యుత్ ఉత్పత్తి

## మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి

## అధికారుల కృషిని అభినందించిన మంత్రి



**అమరావతి,మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)** విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ జెన్కో జీవితకాల రికార్డు సృష్టించిందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్, ఇంధన శాఖల మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. 6101 మెగావాట్లతో జీవితకాల రికార్డు స్థాయిలో ఏపీ జెన్కో ఉత్పత్తి సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తిపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఏపీ సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారుల నిరంతర కృషి వల్లనే ఇది సాధ్యమయ్యిందన్నారు. సీఎం చంద్రబాబు సలహాలు, సూచనలతోనే ఈ రికార్డు సాధ్యమైందని ఉద్ఘాటించారు. ఇంజినీర్లు, అధికారుల అంకితభావం, నైపుణ్యం, కృషితోనే ఈ రికార్డు నమోదైందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. వేసవి విద్యుత్ డిమాండ్ అందుకునేందుకు అధిక స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించడం కీలకమని చెప్పుకొచ్చారు. గృహ, పారిశ్రామిక, వ్యాపార సంస్థలకు నిరంతరాయ విద్యుత్ సరఫరాయే తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. భవిష్యత్తు విద్యుత్ డిమాండ్‌ను అందుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి విద్యుత్ కొనుగోలు చేసేందుకు వైసీపీ హయాంలో ఏపీ జెన్కోని నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో అడ్డగోలుగా తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ. 32 వేల కోట్లు భారం వేశారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ట్రూ డౌన్ చేసిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు.

# 15 లక్షల రూపాయల వ్యయంతో గ్రావెల్ రోడ్డు పనులు.







**ఓబులవారిపల్లి మార్చి 12 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు మండలం రాఘవరాజుపురం పంచాయతీ పరిధిలోని గంగురాజు పురం నుంచి తూర్పుపల్లి వరకు 15 లక్షల రూపాయల వ్యయంతో నిర్మింస్తూన్న గ్రావెల్ రోడ్డు పనులకు గురువారం భూమి పూజ నిర్వహించడం జరిగింది, అంతకు ముందు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రూపానంద్ రెడ్డి కి పూలమాలవేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమం రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ పార్టీ ఇంచార్జ్ మరియు కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించడం జరిగింది,
ఈ సందర్భంగాముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోఉన్నా,ప్రభుత్వం అభివృద్ధి చేయక స్థానిక ప్రజలకు రైతులకు వాహనదారులతో పాదాచారులకు అన్ని విధాల అసౌకర్యంగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణంతో స్థానిక రైతులకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. రవాణా సౌకర్యం మెరుగుపడి రైతులకు గ్రామీణ ప్రాంత ప్రజలకు విద్యార్థులకు వృద్ధులు, పాదాచార్యులకు ఎంతో సౌకర్యవంతంగ ఉంటుందని ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రాంత ప్రజలకు తెలియ చేశారు అనేక సంవత్సరాలుగా ఈ రోడ్డు కోసం ఎదురుచూస్తున్న గ్రామస్తుల కోరిక నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ఆన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ బాల నరసింహులు మరియు మండల రెవెన్యూ, అభివృద్ధి, సచివాలయ అధికారులు ఎన్డీఏ కూటమి నాయకులు ఓబులవారిపల్లి మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పున్నాటి వాసుదేవ రెడ్డి రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి , కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**- సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ.**
ఓబులవారిపల్లి మండలం వై కోట పంచాయతీ బాలిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గజ్జల రమణారెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 50,524 రూపాయలచెక్కును ఆయన స్వగృహంలో స్థానిక ప్రజల సమక్షంలో పంపిణీ చేయడం జరిగినది, ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి మండల అభివృద్ధి అధికారి విజయ రావు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వాసుదేవ రెడ్డి కూటమి నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**గంగమ్మ తల్లి ఆశీస్సులు అందుకున్న రూపానంద రెడ్డి.**
రైల్వే కోడూరు పట్టణంలో గంగమ్మ తల్లి దేవాలయం లో గురువారం కూడా చైర్మన్ తెలుగుదేశం పార్టీ కోడూరు ఇన్చార్జి రూపానంద రెడ్డి గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించి ఆమె ఆశీస్సులు తీసుకున్నారు ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆయన గంగమ్మ తల్లి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పూజారులు రూపానంద రెడ్డికి వేదమంత్రాలతో ఆహ్వానం పలికి ఆయనకు కమిటీ సభ్యులు ఘనంగా ఆయనను పూలమాలతో సెలవుతో సత్కరించడం జరిగినది ఈ కార్యక్రమంలో కోటిగా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





# గుంత రోడ్లు.. విద్యార్థులకు పాట్లు..

## అధికారులకు కనిపించడం లేదా గుంతలు





**ఎమ్మిగనూరు, మార్చి, 12,(రిపబ్లిక్ న్యూస్ ):** ఎమ్మిగనూరు నియోజకవర్గ కేంద్రం లోని నారాయణ, చైతన్య, భాష్యం స్కూల్ల కు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంత విద్యార్థులకు ఇబ్బందికరంగా ఏర్పడి, కడ్డీలు తేలి విద్యార్థులకు శాపంగా మారాయి. గుంతల్లో చాలాసార్లు విద్యార్థులు కింద పడుతూ లేస్తూ సైకిల్ తొక్కుకుంటూ వస్తూ చాలాసార్లు ప్రమాదాలకు గురయ్యారు అని ఆ కాలనీవాసులు, విద్యార్థులు వాపోతున్నారు రోడ్డు గుండా ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లాలంటే విద్యార్థులు జంకుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, కాలనీవాసులు కోరుతున్నారు.

# రాయల్ స్కూల్‌లో ఈద్ కిట్ల పంపిణీ

## -రంజాన్ సందర్భంగా 500 మంది నిరుపేదలకు సహాయం





**నంద్యాల బ్యూరో, మార్చి 12, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణం నడిగడ్డలోని రాయల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రాయల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధ్యక్షులు వి ఖాజా హుస్సేన్, పాఠశాల డైరెక్టర్ డాక్టర్ యాకుబ్ కరస్పాండెంట్ ఇషాక్ వలి ఆధ్వర్యంలో గురువారం ఈద్ కిట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జమాతుల్ ఉలుమా వల్ అయిమ్మ ఫౌండేషన్ ట్రస్ట్ అధ్యక్షులు అబ్దుల్ హాది హాజరత్, నవభారత్ పాఠశాల కరస్పాండెంట్ ఎస్ఎండి హుస్సేన్ పాల్గొనడం జరిగింది పాఠశాల డైరెక్టర్ యాకూబ్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా మెరుగుపడినటువంటి వారందరూ వారు సంపాదనలో 2.5%జకాత్ రూపంలో తీసి నిరుపేదలకు తోడ్పాటు అందించుట అల్లా యొక్క ఆదేశం మేరకు మేము కూడా రాయల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ తరఫునుంచి దాదాపుగా 14 ఏళ్ల నుంచి రంజాన్ తోఫా అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం ఈరోజు మన రాయల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో 50 మందితో మొదలుపెట్టి దాదాపు 500 మంది పేదలకు నిరుపేదలకి, అవసరార్థులకు రంజాన్ పండుగ సంతోషంగా జరుపుకోవాలని రంజాన్ తోఫ ఇవ్వడం జరుగుతుంది. ఈ రంజాన్ తోఫాలో దాదాపుగా 13 రకాల వస్తువులను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి అయినటువంటి హజ్రత్ అబ్దుల్ హాది మాట్లాడుతూ డాక్టర్ యాకుబ్, ఇషాక్ వలి దాదాపుగా 16 సంవత్సరాల నుండి ఈ యొక్క రంజాన్ తోఫా పేద ప్రజలకు ఇచ్చి వారు కూడా అందరితో సమానంగా రంజాన్ పండుగ చేసుకోవాలని ఉద్దేశంతో ఈ కిట్లని ఇవ్వడం జరుగుతుందని చెప్పడం జరిగింది. నవ భారత్ పాఠశాల కరస్పాండెంట్ ఎస్ఎండి హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆదాయంలో నుంచి రెండున్నర పర్సెంట్ జకాత్ రూపంలో తీసి పేద ప్రజలకు పంచినట్లయితే వారు కూడా సంతోషంగా ఈ యొక్క ఈ రంజాన్ పండుగ నిర్వహించుకుంటారని ఈ విధంగా చేయడం ద్వారా అల్లా యొక్క కృపా వల్ల మనం ఇతరులకు ఉపయోగపడినట్టు అవుతుందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాహేరా హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ మెంబర్ వి యూసుఫ్ షరీఫ్ మౌలానా సాయి వాణి స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్ బాషా, రాయల్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ఆర్‌సిపి ఆవిర్భావ దినోత్సవం



**బండి ఆత్మకూరు, మార్చి 12, (రిపబ్లిక్ న్యూస్):-** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని బండి ఆత్మకూరు మండల వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గురువారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రం బండి ఆత్మకూరులో మండల కన్వీనర్ బారెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే మండలంలోని ఏ.కోడూరులో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక బస్టాండ్ ఆవరణలోని దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తర్వాత పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేరు వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దివంగత రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించి తన తండ్రి ఆశయ సాధన కోసం వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించడం జరిగిందన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి దేశంలోనే కనివిని ఎరగని విధంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించి తన తండ్రి ఆశయాలను కొనసాగించారన్నారు. అలాగే శ్రీశైలం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆనాటి వైసిపి ప్రభుత్వంలో ఒకవైపు నియోజకవర్గ అభివృద్ధి, మరోవైపు ప్రజా సంక్షేమాన్ని కొనసాగించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.వైసీపీ నాయకులు పల్లె సోమ శేఖర్ రెడ్డి, పరమటూరు గ్రామ సర్పంచ్ రేగటి జగన్మోహన్ రెడ్డి, రేగటి బలరామి రెడ్డి, రాగాల రమణ, రాగాల బాబుల్ ఏ.కోడూరు గ్రామ నాయకులు శ్రీరామ్ రెడ్డి,నోస్సశీ సుబ్రహ్మణ్యం రెడ్డి, బిజ్జం వెంకటేశ్వర్ రెడ్డి, తమ్మి రెడ్డి, వెంకట రమణ ,తలారి శ్రీనివాసులు,నాగమయ్య, చింతమాను బాలస్వామి, కుళాయి స్వామి, పుల్లయ్య , కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశాలను అమలు చేయండి

## పారిశుద్ధ్య కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

## కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

కర్నూలు**మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**

మెడికల్ అండ్ హెల్త్ శాఖలో హైకోర్టు ఆదేశాలను తక్షణం అమలు చేసి అక్రమంగా తొలగించిన పారిశుద్ధ్య కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. పద్మావతి ఫెర్టిలిటీ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం సిఐటియు కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, కెవిపిఎస్ నగర అధ్యక్షుడు రమణ మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ కళాశాలలో హాస్టల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను ఇష్టానుసారంగా తొలగిస్తున్నారన్నారు. మహిళ కార్మికులను 50 సంవత్సరాలు పైబడిన నేపథ్యంతో తొలగించడం దుర్మార్గమన్నారు. అనంతపురం, కడప , తిరుపతి, నంద్యాల ఆస్పత్రిలో పనిచేసేటువంటి పారిశుద్ధ్య కార్మికులను తొలగించారన్నారు

# జి హేమంత్ రెడ్డికి డాక్టరేట్

## శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల తరఫున ఘన సత్కారం - డాక్టర్ జి హేమంత్ రెడ్డికి ప్రముఖుల అభినందనలు

**నంద్యాల మార్చి12( (రిపబ్లిక్ న్యూస్)**

శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల (అటానమస్) డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి ప్రతిష్టాత్మకమైన పిహెచ్‌డి పట్టాను పొందిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని, కళాశాల ప్రాంగణంలో గురువారం ఘనంగా సన్మాన మహోత్సవం నిర్వహించారు.







### హేమంత్ రెడ్డి భాగస్వామిగా ఉండడం నా అదృష్టం -ప్రగతి

"డాక్టర్ జి. హేమంత్ రెడ్డి కి భాగస్వామిని కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆయనకు చదువు పట్ల, పరిశోధనల పట్ల ఉన్న మక్కువ మా కుటుంబానికి స్ఫూర్తిదాయకం. నేను భవిష్యత్తులో ఏ రంగంలోనైనా ముందుకు సాగడానికి ఆయన ఇచ్చే మద్దతు వెలకట్టలేనిది. ఈ విజయం ఆయన కష్టానికి దక్కిన సరైన ప్రతిఫలం" అని భావోద్వేగంగా పంచుకున్నారు.

### తండ్రిగా కుమారుని విజయానికి గర్విస్తున్నాను డాక్టర్ జి రామకృష్ణారెడ్డి

కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ తన కుమారుడు డాక్టర్ జి. హేమంత్ రెడ్డి ఈ అరుదైన మైలురాయిని చేరుకోవడం తండ్రిగా తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చైతన్య కళాశాల యాజమాన్యానికి మరియు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యంగా, అధ్యాపకులను ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు: "మన కళాశాలలో అత్యాధునిక పరిశోధనా కేంద్రం అందుబాటులో ఉంది. అధ్యాపకులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలి. కేవలం బోధనకే పరిమితం కాకుండా, కొత్త విషయాలను కనుగొనే దిశగా అడుగులు వేయాలి. పరిశోధనలు చేసే ప్రతి ఒక్కరికీ కళాశాల యాజమాన్యం నుండి పూర్తి స్థాయి ఆర్థిక మరియు నైతిక మద్దతు ఉంటుంది" అని భరోసా ఇచ్చారు.

### నా డాక్టరేట్ మా నాన్నకు అంకితం - డాక్టర్ జి హేమంత్ రెడ్డి

సన్మాన గ్రహీత డాక్టర్ జి. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ... చైర్మన్ , ప్రిన్సిపాల్ , నా తోటి అధ్యాపక మిత్రులకు, నా కుటుంబ సభ్యులకు మరియు ఇక్కడికి విచ్చేసిన నా ప్రియతమ విద్యార్థులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు

ఇంపాక్ట్ ఆఫ్ జీరో మూమెంట్ ఆఫ్ ట్రూత్ జెడ్ ఎమ్ ఓ టి ఆన్ బ్రాండ్ క్వాలిటీ అనే అంశం చైతన్య యూనివర్సిటీ, వరంగల్ లోని వాణిజ్య శాస్త్రంలోని ప్రొఫెసర్ పి. రాజేందర్ పర్యవేక్షణ లో పరిశోధనగాను పి హెచ్ డి ప్రధానం చేయడం జరిగింది అని, ఈ అధ్యయనం ప్రధానంగా రాయలసీమ ప్రాంతంలోని ప్రజలు ఎలక్ట్రానిక్ వస్తువులను కొనే ముందు ఇంటర్నెట్‌లో చూసే సమాచారం ( జెడ్ ఎం ఓ టి), ఆయా కంపెనీల బ్రాండ్ విలువపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతుందో వివరిస్తుంది.

నేను సాధించిన ఈ పట్టా అనేది మా తండ్రిగారైన ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి కి అంకితం చేస్తున్నానని తెలియజేశారు. "ఈ పిహెచ్‌డి పట్టా నా ఒక్కడిది కాదు, ఇది మన శ్రీ రామకృష్ణ కళాశాల కుటుంబం అందరిది. ఈ ప్రయాణంలో నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. ప్రతి అధ్యాపకుడు కనీసం ఒక అంశంపై పరిశోధన చేయాలని, అది విద్యార్థులకు మరియు సమాజానికి ఎంతో మేలు చేస్తుందని" కోరారు.

ఈ రోజు నా మెడలో ఉన్న ఈ శాలువా, నా చేతిలో ఉన్న ఈ సన్మాన పత్రం కేవలం ఒక పట్టాకు సంబంధించినవి కావు; ఇవి గత కొన్ని ఏళ్లుగా నేను చేసిన కృషికి, మీరు చూపిన నమ్మకానికి ప్రతిరూపాలు. నిజం చెప్పాలంటే, పిహెచ్‌డి అనేది ఒక డిగ్రీ మాత్రమే కాదు, అది ఒక నిరంతర అన్వేషణ. ఈ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి, మరెన్నో రాత్రులు నిద్రలేని గడిచాయి. కానీ, ఆ కష్టమంతా ఈ రోజు మీ అందరి ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం ముందు చాలా చిన్నదిగా అనిపిస్తోంది.

నేను ఈ వేదిక ద్వారా నా తోటి అధ్యాపక మిత్రులకు ఒక ముఖ్యమైన విషయాన్ని చెప్పాలనుకుంటున్నాను. మనం కేవలం తరగతి గదిలో పాఠాలు చెప్పే బోధకులం మాత్రమే కాదు, మనం జ్ఞానాన్ని సృష్టించే 'పరిశోధకులం' కావాలి. విద్యా రంగంలో మార్పులు వేగంగా వస్తున్నాయి. మనం అప్‌డేట్ అవ్వకపోతే అవుట్‌డేట్ అయిపోతాము. అందుకే, ప్రతి అధ్యాపకుడు కనీసం ఒక చిన్న అంశం పైనైనా పరిశోధన చేయాలని నేను కోరుకుంటున్నాను. మన సబ్జెక్టులో మనం లోతుగా వెళ్ళినప్పుడే, విద్యార్థులకు మనం అద్భుతమైన జ్ఞానాన్ని అందించగలం.

### కళాశాల మద్దతు మన అదృష్టం

మన చైర్మన్ చెప్పినట్లు, మన శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో అన్ని సౌకర్యాలతో కూడిన 'రీసెర్చ్ సెంటర్' అందుబాటులో ఉంది. బయట ఎక్కడో వెతుక్కోవాల్సిన అవసరం లేదు. మేనేజ్‌మెంట్ మనకు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తోంది. ఈ అవకాశాన్ని మనం వదులుకోకూడదు. పరిశోధన చేయాలనుకునే ప్రతి అధ్యాపకుడికి నా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుంది. మనం కలిసి మన కళాశాలను ఒక గొప్ప విద్యా కేంద్రంగానే కాకుండా, ఒక అత్యున్నత పరిశోధనా కేంద్రంగా కూడా తీర్చిదిద్దుదాం. నా ఈ విజయ ప్రయాణంలో నాకు వెన్నుముకగా నిలిచిన మా నాన్నగారికి (చైర్మన్ ), ప్రతి అడుగులో నాకు చేదోడు వాదోడుగా ఉంటూ, తను కూడా కష్టపడుతూ నన్ను ప్రోత్సహించిన నా అర్ధాంగి ప్రగతికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. అలాగే చైతన్య కళాశాల యాజమాన్యానికి, నా విభాగానికి, ముఖ్యంగా నన్ను అభినందించడానికి ఇక్కడికి వచ్చిన నా ఎంబీఏ పూర్వ విద్యార్థులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు.

చివరగా ఒక్క మాట.. గమ్యం చేరిన తర్వాత వచ్చే ఆనందం కంటే, ఆ గమ్యం వైపు మనం సాగించే ప్రయాణం మనల్ని గొప్పగా మలుస్తుంది. నేటితో నా ప్రయాణం ముగియలేదు, ఈ 'డాక్టర్' అనే బిరుదుతో నా బాధ్యత మరింత పెరిగింది. మీ అందరి సహకారంతో మన కళాశాలను మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తానని ప్రామిస్ చేస్తున్నాను అని తెలిపారు.

ఈ వేడుకలో ముఖ్యంగా కళాశాల పూర్వ విద్యార్థులు అయినటువంటి జావేద్, నదీమ్, వినయ్ కూడా కార్యక్రమంలో పాల్గొని వారి ప్రియమైన డైరెక్టర్ కి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం చివరిలో వందన సమర్పణతో అత్యంత వైభవంగా ముగిసింది.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com